


ఆర్ఎన్ఐ/2009/ 28733 స్థాపితం : 2003

# ఆంధ్రనాడు

తెలుగు దినపత్రిక

సంపుటి : 22 సంచిక: 42 తిరుపతి తేది : మంగళవారం 12 మే 2026 పేజీలు : 08 ధర : రూ.6 PUBLISHED FROM TIRUPATI, CHITTOOR, ANNAMAIAH, ANANTHAPUR DISRICTS

### ఇజ్రాయిల్ దాడులు..

## లెబనాన్‌లో 51 మంది మృతి

లెబనాన్ - ఆంధ్రనాడు, మే 11



ఇజ్రాయిల్ దాడుల వల్ల గడచిన 24 గంటల్లో లెబనాన్‌లో ఇద్దరు వైద్య సిబ్బందితో సహా 51 మంది మృతి చెందారు. ఈ విషయాన్ని లెబనాన్ ఆరోగ్య మంత్రిత్వశాఖ వెల్లడించింది. ఇజ్రాయిల్ సైన్యం అంతర్జాతీయ చట్టాలు, మానవతా ప్రమాణాలను ఉల్లంఘిస్తూనే ఉంది. పారామెడిక్స్‌పై మరిన్ని నేరాలకు పాల్పడుతోంది. బింట్ జ్బెయిల్ జిల్లాలోని ఖలావియా, టిబ్నిన్‌లలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని రెండుసార్లు దాడులకు పాల్పడగా... ఈ దాడుల్లో ఇద్దరు వైద్య సిబ్బంది మృతి చెందారని

- మిగతా 2లో..

# ఆమోదయోగ్యం కాదు

- ఇరాన్ తాజా ప్రతిపాదనను తోసిపుచ్చిన ట్రంప్ దాడులు చేస్తే ప్రతీకారం తప్పదు :
- టెహ్రాన్ హెచ్చరిక

టెహరాన్ - ఆంధ్రనాడు, మే 11



పశ్చిమాసియాలో యుద్ధాన్ని ముగించేందుకు ఇరాన్ చేసిన తాజా ప్రతిపాదనను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదివారం తోసిపుచ్చారు. అది తనకు ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశారు. అయితే ఇరాన్ ప్రతిపాదనలేమిటో ఆయన వివరించలేదు.

'ఇరాన్ ప్రతినిధులుగా చెప్పుకుంటున్న వారి స్పందనను ఇప్పుడే చదివాను. దానిని నేను ఇష్టపడడం లేదు' అని చెప్పారు. ఇరాన్ ప్రతిపాదనలను అమెరికా తోసిపుచ్చిన నేపథ్యంలో ఘర్షణలు కొనసాగవచ్చునన్న భయాందోళనల మధ్య చమురు ధరలు సోమవారం భగ్గుమన్నాయి. ఒకవేళ అమెరికా దాడులకు తెగబడితే ప్రతీకార దాడులు చేస్తానని ఇరాన్ హెచ్చరించింది. హోర్ముజ్ జలసంధిలోకి ఇకపై విదేశీ యుద్ధ నౌకలను అనుమతించబోనని తేల్చి చెప్పింది.

**అమెరికా సైనిక మద్దతును పూర్తిగా తగ్గించుకుంటాం : నెతన్యాహూ**

గల్ఫ్ దేశాలతో సంబంధాలను బలోపేతం చేసుకునేం దుకు తాము ప్రయత్నిస్తున్నందున ఒక దశాబ్ద కాలం లోగా అమెరికా సైనిక మద్దతుపై ఆధారపడడాన్ని పూర్తిగా తగ్గించుకోవాలని ఆశిస్తున్నట్లు ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ చెప్పారు. సీబీఎస్ న్యూస్‌కు చెందిన ఓ కార్యక్రమంలో నెతన్యాహూ మాట్లాడుతూ 'సైనిక సహకారం ద్వారా అమెరికా అందజేస్తున్న ఆర్థిక మద్దతును జీరో స్థాయికి తీసుకురావాలని అనుకుం టున్నాను' అని అన్నారు. ఇజ్రాయిల్ ఏటా

- మిగతా 2లో..

## పెట్రోల్, నూనె వాడకాన్ని తగ్గించండి

### - ప్రధాని నరేంద్ర మోడీ

న్యూఢిల్లీ - ఆంధ్రనాడు, మే 11



దేశంలో నెలకొన్న ఆర్థిక అనిశ్చితి, సరఫరా గొలుసులో ఏర్పడిన అంతరాయాలను అధిగమిం చేందుకు ప్రజలు తమ జీవనశైలిని మార్చుకోవాలని ప్రధాని నరేంద్ర మోడీ కోరారు. పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో ప్రపంచ వ్యాప్తంగా ముడి చమురు ధరలు పెరగడాన్ని ప్రస్తావిస్తూ మోడీ ఈ వ్యాఖ్యలు చేశారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చి ప్రధాని ప్రజలపై ఆంక్షలు విధించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన బహిరంగ సభలో మోడీ, విదేశీ మారకద్రవ్యాన్ని ఆదా చేసేందుకు ఏడాది పాటు బంగారం కొనుగోళ్లు, విదేశీ ప్రయాణాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. విదేశీ మారకద్రవ్య నిల్వలపై ఒత్తిడిని తగ్గించేందుకు బంగారం కొనుగోళ్లను నియంత్రించుకోవాలని

- మిగతా 2లో..

### 2027 నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తికి

# సహకారం అందించాలి

- ఢిల్లీలో గట్టిగా గళం వినిపించిన సీఎం చంద్రబాబు
- కేంద్ర మంత్రులు అమిత్ షా, సీఆర్ పాటిల్‌తో భేటీ
- ఆలమట్టి డ్యామ్ ఎత్తు పెంచవద్దని, యథాతథ స్థితిని కొనసాగించాలని వినతి
- పెండింగ్ నిధులు, విభజన హామీలను నెరవేర్చాలని కోరిన సీఎం
- 'హర్ ఖేత్ కో పానీ' పథకం కింద రూ.285 కోట్లు విడుదల చేయాలని అభ్యర్థన

న్యూఢిల్లీ - ఆంధ్రనాడు, మే 11



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించిన కీలక ప్రాజెక్టులు, పెండింగ్ నిధుల మంజూరు కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ పర్యటనకు వెళ్లడం తెలిసిందే. ఇందులో భాగంగా సోమవారం ఆయన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా, కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో వేర్వేరుగా సమావేశమయ్యారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులను వెంటనే విడుదల చేయాలని, విభజన హామీలను నెరవేర్చాలని గట్టిగా విజ్ఞప్తి చేశారు. ముందుగా కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో భేటీ అయిన చంద్రబాబు... రాష్ట్రానికి కేంద్ర ప్రాయోజిత పథకాల కింద రావలసిన నిధులతో పాటు, విభజన చట్టంలోని పెండింగ్ అంశాలను ప్రస్తావించారు. రాష్ట్ర అభివృద్ధికి ప్రస్తుత కేంద్ర బడ్జెట్‌లో ప్రత్యేక కేటాయింపులు జరిపి, అవసరమైన సహకారం అందించాలని కోరారు. అనంతరం కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి ప్రధానంగా పోలవరం ప్రాజెక్టుపై దృష్టి సారించారు. 2027 గోదావరి పుష్కరాల నాటికి ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును పూర్తి చేయాలన్నదే తమ లక్ష్యమని, ఇందుకు కేంద్రం

- మిగతా 2లో..




## త్వరలో సర్ షెడ్యూల్

- రాష్ట్ర వ్యాప్తంగా ఇండ్ల మ్యాపింగ్‌ను వేగవంతం చేయండి
- జిల్లా కలెక్టర్లకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఆదేశం

న్యూఢిల్లీ - ఆంధ్రనాడు, మే 11

తెలంగాణలో త్వరలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రారంభం కానున్న నేపథ్యంలో, ఇండ్ల మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లు, డీఈఓలను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయం నుంచి వారితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎలక్షన్

- మిగతా 2లో..

## భవిష్యత్ సాంకేతిక రంగాల్లో యువతకు భారీ అవకాశాలు

- సీఐఐ సదస్సులో సీఎం చంద్రబాబు
- ప్రధాని మోదీ ఇచ్చిన 8 సూత్రాల జాతీయ మిషన్‌ను వివరించిన చంద్రబాబు
- మోదీ నేతృత్వంలో భారత్ అగ్రస్థానానికి చేరుతుందని ధీమా
- ప్రకృతి సేద్యం ద్వారా ఎరువుల దిగుమతి తగ్గించవచ్చని సూచన
- ఏపీలో 20 లక్షల ఎకరాల్లో ప్రకృతి సేద్యం చేస్తున్నామని వెల్లడి
- దేశం, రాష్ట్ర ప్రయోజనాలే తన అజెండా అని స్పష్టీకరణ




న్యూఢిల్లీ- ఆంధ్రనాడు, మే 11

దేశ స్వయం సమృద్ధి, సుస్థిర అభివృద్ధి లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోదీ ప్రజల ముందుంచిన 8 అంశాల జాతీయ మిషన్‌ను ప్రతిఒక్కరూ స్వీకరించా లని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపు నిచ్చారు. ఢిల్లీలోని తాజ్ ప్యాలెస్‌లో జరిగిన సీఐఐ బిజినెస్ సమ్మిట్‌లో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన ప్రధాని ప్రతిపాదించిన 8 సూత్రాలను కూలంకషంగా వివరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలు బంగారం కొనుగోళ్లను కొంతకాలం వాయిదా వేయాలని ప్రధాని పిలుపునిచ్చినట్లు చంద్రబాబు గుర్తుచేశారు. ఇంధనాన్ని పొదుపుగా వాడాలని, అదే సమయంలో ప్రతి ఇల్లు, పరిశ్రమ, పొలం ఒక విద్యుత్ ఉత్పత్తి కేంద్రంగా మారాలని సూచించారు. యుద్ధానంతర పరిస్థితుల వల్ల గ్యాస్ సరఫరాలో తలెత్తిన ఇబ్బందులను అధిగమించేందుకు ప్రజా రవాణా వినియోగాన్ని పెంచడం కీలకమన్నారు. దేశంలో మెరుగైన మౌలిక సదుపాయాలు ఉన్నందున, 'వర్క్ ఫ్రమ్ హోమ్' విధానాన్ని ప్రోత్సహించాలని ప్రధాని సూచించినట్లు తెలిపారు. వీటన్నింటి ద్వారా 'గ్రేటర్ సెల్ఫ్ రిలయన్స్' (సంపూర్ణ స్వావలంబన) సాధించడం సాధ్యమవుతుందని, ఇందులో భాగంగా ప్రకృతి సేద్యం కీలక పాత్ర పోషిస్తుందని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రకృతి సేద్యం వల్ల ఎరువుల దిగుమతి తగ్గి దేశం స్వయం సమృద్ధి

- మిగతా 2లో..

ANDHRANADU
TELUGU DAILY

మంగళవారం
12.05.2026

తిరుపతి – చిత్తూరు
అన్నమయ్య– అనంతపురం
ఆంధ్రనాడు

### ఇజ్రాయిల్ దాడులు..

# లెబనాన్‌లో 51 మంది మృతి

(మొదటిపేజీ తరువాయి)
ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆదివారం తెలిపింది. కాగా, లెబనాన్- ఇజ్రాయిల్ మధ్య మూడు వారాల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినట్లు అమెరికా వెల్లడించింది. ఇది మూడో వారం. అయినప్పటికీ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ ఇజ్రాయిల్ లెబనాన్‌పై దాడులకు పాల్పడుతూనే ఉంది. ఈ ఏడాది మార్చి 2న ప్రారంభమైన ఇజ్రాయిల్ దాడుల వల్ల ఇప్పటివరకు 2,846 మంది మృతి చెందారని లెబనాన్ ఆరోగ్య మంత్రిత్వశాఖ వెల్లడించింది. మార్చి నుంచి ఇప్పటివరకు ఇజ్రాయిల్ 130కి పైగా దాడులు జరిపింది. ఈ దాడుల్లో 103 మంది మెడికల్ వర్కర్ల్లు చనిపోయారు. 230 మంది గాయాలపాలయ్యారని ఐక్యరాజ్య సమితి తెలిపింది. "మేము ప్రతి క్షణం, ప్రతి రోజూ ఇజ్రాయిల్ ముప్పును ఎదుర్కొంటున్నాము" అని దక్షిణ లెబనాన్‌లోని టైర్‌లో ఉన్న లెబనీస్ సివిల్ డిఫెన్స్ అధిపతి అలీ సఫియుద్దీన్ మీడియాకు వెల్లడించారు. మేము ఈ దాడుల వల్ల బ్రతుకుతామా లేక చనిపోతామా అని మమ్మల్ని మేము ప్రశ్నించుకుంటాం. కానీ ఇక్కడ పని చేయడం ద్వారా మా జీవితాలను ఇప్పటికే కోల్పోయామని మాకు తెలుసు. మేము ఎంతో మందిని కోల్పోయాము. మేము కూడా ఇకలేనట్లే అనిపిస్తోంది అని అలీ తెలిపారు.

# పెట్రోల్, నూనె వాడకాన్ని తగ్గించండి

(మొదటిపేజీ తరువాయి)
ప్రధాని సూచించారు. విదేశీ ప్రయాణాలకు దూరంగా ఉండటం మంచిదని అభివర్ణించిన మోడీ, విదేశాల్లో జరిగే వివాహ వేడుకలను కూడా వదులుకోవాలని ప్రజలను కోరారు. ప్రభుత్వ ఆర్థిక విధానాల వైఫల్యం కారణంగా తలెత్తిన విదేశీ మారకద్రవ్య సంక్షోభ భారాన్ని సామాన్య పౌరులపై మోపడమే ఇందుకు నిదర్శనం. దేశంలో ఇంధన వినియోగాన్ని తగ్గించేందుకు కోవిడ్ కాలంలోని వర్క్-ఫ్రమ్-హోమ్ విధానం, ఆన్‌లైన్ సమావేశాలను తిరిగి ప్రారంభించాలని మోడీ అన్నారు. ప్రధానమంత్రి ప్రజా రవాణాపై ఆధారపడాలని, విద్యుత్ వాహనాలకు మారాలని పిలుపునిచ్చారు. అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం లేదా ఇంధన ధరలను తగ్గించడం గురించి ఆయన ఎలాంటి స్పష్టమైన హామీలు ఇవ్వలేదు. దిగుమతులను తగ్గించడానికి వంట నూనె వాడకాన్ని తగ్గించాలని ప్రధానమంత్రి ఒక వింత సూచన కూడా చేశారు. రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని కనీసం 50 శాతం తగ్గించి, సేంద్రియ వ్యవసాయానికి మారాలని కూడా ఆయన కోరారు. ఎరువుల సబ్సిడీలు ప్రభుత్వంపై భారీ ఆర్థిక భారం అనే పరోక్ష సూచనతో ఈ వ్యాఖ్య చేశారు. ప్రపంచ సవాళ్లు సరఫరా గొలుసును దెబ్బతీస్తున్నప్పటికీ, ప్రధానమంత్రి తన ముప్పై నిమిషాల ప్రసంగంలో దేశీయ మార్కెట్లో ధరల పెరుగుదలను అరికట్టడానికి లేదా రూపాయి విలువ క్షీణతను పరిష్కరించడానికి ఎలాంటి నిర్మాణాత్మక చర్యలు తీసుకోలేదు. పౌరులు బాధ్యతాయుతమైన జీవనశైలిని అలవర్చుకోవాల్సిన అవసరం గురించి మాట్లాడుతూనే, కార్పొరేట్ అనుకూల విధానాల వల్ల దేశం కుప్పకూలడంపై మోడీ మౌనం వహించారు.

# త్వరలో సర్ షెడ్యూల్

(మొదటిపేజీ తరువాయి)
కమిషన్ ఆఫ్ ఇండియా (ఈసీఐ) ఆదేశం మేరకు ఈ నెలాఖరులోగా 90 శాతం పురోగతి సాధించాలన్నారు. ఈఆర్ఓఎస్, ఏఈఆర్ఓఎస్, బీఎల్ఓ సూపర్‌వైజర్లు బీఎల్ఓలతో కలిసి గేటెడ్ కమ్యూనిటీలు, మురికివాడల ప్రతినిధులను భాగస్వాములను చేస్తూ మ్యాపింగ్ కోసం ఆయా ప్రాంతాలను సందర్శించాలన్నారు. ఓటర్లను మ్యాపింగ్ చేయించుకోవడంలో సహాయపడటానికి హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. నియోజకవర్గాల్లో మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయడానికి స్వయం సహాయక బృందాలు, రేషన్ షాపు డీలర్లు, ఉద్యోగ సంఘాలను భాగస్వాములను చేయాలన్నారు. మరణించిన, వలస, శాశ్వతంగా తరలివెళ్లిన ఓటర్లపై దృష్టి సారించి సరిదిద్దడానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే తమ నియోజకవర్గాల్లో వీవీఐపీ, వీఐపీ ఓటర్ల మ్యాపింగ్‌ను చేపట్టాలని ఆదేశించారు. ప్రతి బుధవారం ఈఆర్ఓల ద్వారా రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించి, ఎస్ఐఆర్ మ్యాపింగ్ పురోగతిని సమీక్షించాలని ఆదేశించారు. మ్యాపింగ్‌కు సంబంధించి అనధికార వ్యక్తులతో ఎలాంటి సమాచారాన్ని గానీ, ఓటీపీలను గానీ పంచుకోవద్దని బీఎల్ఓలను హెచ్చరించారు. అలా చేయని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తప్పుడు మ్యాపింగ్‌లు ఎక్కడైనా నమోదైతే వెంటనే సరిదిద్దాలని కోరారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర అదనపు ప్రధాన ఎన్నికల అధికారి డాక్టర్ వాసం వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### 2027 నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తికి

# సహకారం అందించాలి

(మొదటిపేజీ తరువాయి)
సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. తొలిదశలో 41.15 మీటర్ల మేర నీటిని నిల్వ చేసేందుకు అవసరమైన పనులు పూర్తి చేయాల్సి ఉందని తెలిపారు. తాను ఇప్పటికే ఐదుసార్లు ప్రాజెక్టును సందర్శించి పనుల పురోగతిని సమీక్షించానని, కొత్త డయాఫ్రామ్ వాల్ నిర్మాణం ఏప్రిల్ నాటికి పూర్తయిందని వివరించారు. ప్రాజెక్టు పనులకు అడ్డంకిగా ఉన్న 'స్టాప్ వర్క్ ఆర్డర్'ను శాశ్వతంగా ఉపసంహరించుకోవాలని కోరారు. అలాగే, సామర్థ్యం పెంచిన కుడి, ఎడమ కాలువలకు అయిన అదనపు ఖర్చును రీఎంబర్సు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇదే సమావేశంలో 'ప్రధాన మంత్రి కృషి సించాయీ యోజన'లోని 'హర్ ఖేత్ కో పానీ' పథకం కింద రాష్ట్రంలోని 297 నీటి వనరుల పునరుద్ధరణకు రూ.285 కోట్లు మంజూరు చేయాలని కోరారు. మరోవైపు, సుప్రీంకోర్టు తుది తీర్పు వచ్చే వరకు ఆలమట్టి డ్యామ్ ఎత్తును 524.256 మీటర్లకు పెంచే అంశంపై గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వొద్దని స్పష్టం చేశారు. ఈ నిర్ణయం ఏపీ ప్రయోజనాలకు నష్టం చేకూరుస్తుందని, కర్ణాటక చేపడుతున్న పనులను నిలిపివేసేలా ఆదేశించాలని కోరారు. రాయలసీమ, దక్షిణ కోస్తాంధ్ర దాహార్తిని తీర్చే పోలవరం-బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వాలని, నేరడి బ్యారేజ్ నిర్మాణానికి ఒడిశా సహకరించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ పర్యటనలో ముఖ్యమంత్రి వెంట జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




# ఆమోదయోగ్యం కాదు

(మొదటిపేజీ తరువాయి)
3.8 బిలియన్ డాలర్ల విలువ కలిగిన అమెరికా సైనిక సాయాన్ని పొందుతోందని తెలిపారు. 2018 నుంచి 2028 వరకూ ఇజ్రాయిల్‌కు మొత్తం 38 బిలియన్ డాలర్ల సైనిక సాయాన్ని అందజేయడానికి అమెరికా అంగీకరించింది. అయితే అమెరికా-ఇజ్రాయిల్ సైనిక సంబంధాలను సవరించు కోవడానికి కచ్చితంగా ఇదే సరైన సమయమని నెతన్యాహూ అన్నారు. తదుపరి కాంగ్రెస్ ఏర్పడే వరకూ వేచి చూడాలని అనుకోవడం లేదని, ఇప్పుడే ఈ ప్రక్రియను మొదలు పెడతానని చెప్పారు. ఇజ్రాయిల్‌కు సైనిక సహకారం అందించే విషయంలో అమెరికా కాంగ్రెస్ ఏకాభిప్రాయంతోనే ఉంది. అయితే గాజాలో యుద్ధం మొదలైనప్పటి నుంచి ఈ సాయానికి అమెరికా ప్రజలతో పాటు చట్టసభ సభ్యుల మద్దతు కూడా తగ్గిపోతోంది. మార్చిలో నిర్వహించిన ఓ సర్వే ప్రకారం 60 శాతం మంది అమెరికా పౌరులు ఇజ్రాయిల్‌పై వ్యతిరేకత వ్యక్తం చేశారు. దీనంతటికీ సోషల్ మీడియాయే కారణమని నెతన్యాహూ మండిపడ్డారు. అనేక దేశాలు సోషల్ మీడియాను ఉపయోగించుకొని తమపై దుష్ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు.

**అసంపూర్తి విద్యుత్ ప్రాజెక్టుల కోసం బిల్లులు వసూలు చేస్తున్న అమెరికా**

ఎలాంటి ప్రయోజనం పొందకుండానే, అది ఎలా ఉంటుందో తెలియకుండానే లక్షలాది మంది అమెరికా ప్రజలు ఎలక్ట్రిక్ గ్రిడ్ ప్రాజెక్టులకు నిధులు అందజేస్తున్నారు. దేశంలోని విద్యుత్ గ్రిడ్ పాతపడిపోవడంతో దానిని సమూలంగా మార్చాలని విధాన రూపకర్తలు నిర్ణయించారు. అందులో భాగంగా విద్యుత్ ప్లాంట్లు, ప్రసార లైన్లు నిర్మించకముందే వినియోగదారుల నుంచి ఛార్జీలను వసూలు చేయడానికి యుటిలిటీలను అనుమతిస్తున్నారు. దశాబ్దాల తర్వాత డబ్బు ఆదా అవుతుందని హామీ ఇస్తూ సమీప భవిష్యత్తులోనే బిల్లులను పెంచేస్తున్నారని రాయిటర్స్ వార్తా సంస్థ తెలిపింది. కృత్రిమ మేధకు అవసరమైన డేటా కేంద్రాల నుంచి డిమాండ్ పెరుగుతున్న తరుణంలోనే గ్రిడ్ నవీకరణను వేగవంతం చేయాలని విధాన రూపకర్తలు భావిస్తున్నారు. అయితే ఇప్పటికే పెరిగిన ఇంధన ఛార్జీలతో గృహ వినియోగదారులు, వ్యాపారులు సతమతమ వుతున్నారు. మూలిగే నక్కపై తాటి పండు పడిన చందంగా వీరి విద్యుత్ బిల్లులు ఇకపై తడిసి మోపడవబోతున్నాయి.
ఖరీదైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు నిర్మించాలనుకునే యుటిలిటీలు బ్యాంకులు, పెట్టుబడిదారుల నుంచి రుణాలు పొందాల్సి ఉంటుంది. ప్రాజెక్టులు పూర్తయిన తర్వాతే ఆ ఖర్చులను వినియోగదారుల నుంచి రాబట్టుకోవాలి. అయితే ఇక్కడ ఓ తిరకాసు ఉంది. నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నప్పుడు ప్రోత్సాహకాల కింద ముందుగానే నిధులు సమకూర్చుకునే వెసులుబాటు ఉండడంతో యుటిలిటీలు వినియోగదారులపై అదనపు భారం వేస్తున్నాయి. ఒక్కో గృహ వినియోగ బిల్లుపై కొన్ని డాలర్ల వరకూ భారం పడుతుంది.

**మా డిమాండ్లు చట్టబద్ధమైనవే : ఇరాన్**

తమ డిమాండ్లను ట్రంప్ తోసిపుచ్చిన నేపథ్యంలో ఇరాన్ విదేశాంగ ప్రతినిధి ఇస్మాయిల్ బాఘై ఒక ప్రకటన చేస్తూ తమ ప్రతిపాదనలన్నీ ఉదారమైనవి, బాధ్యతాయుతమైనవేనని తెలిపారు. 'మా డిమాండ్లు చట్టబద్ధమైనవి. యుద్ధాన్ని ముగించాలని చెప్పాం. అమెరికా దిగ్బంధాన్ని ఎత్తివేయాలని అడిగాం. సముద్రపు దోపిడీని ఆపాలని కోరాం. అమెరికా ఒత్తిడుల కారణంగా బ్యాంకులలో స్తంభింపచేసిన ఇరాన్ ఆస్తులను విడుదల చేయాలని డిమాండ్ చేసాం' అని అన్నారు. హోర్ముజ్ జలసంధి మీదుగా నౌకలు సురక్షితంగా ప్రయాణించేలా చూడడం, ఆ ప్రాంతంలోనూ, లెబనాన్‌లోనూ భద్రతా ఏర్పాట్లు చేయడం కూడా తమ డిమాండ్లలో ఉన్నాయని తెలిపారు. ఇదిలావుండగా ఇరాన్ తాజా ప్రతిపాదనను అమెరికా తోసిపుచ్చిన నేపథ్యంలో నెలకొన్న ప్రతిష్టంభన కారణంగా హోర్ముజ్ జలసంధి చాలా వరకూ మూతపడింది. దీంతో చమురు ధరలు సోమవారం సుమారు మూడు శాతం మేర పెరిగాయి.

**రేపటి నుంచి చైనాలో ట్రంప్ పర్యటన వాణిజ్యం, ఇరాన్ సహా పలు అంశాలపై జిన్‌పింగ్‌తో చర్చలు**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం నుంచి మూడు రోజుల పాటు చైనాలో పర్యటిస్తారు. ఈ పర్యటనలో భాగంగా చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో జరిపే సమావేశంలో ఇరాన్, తైవాన్, ఎఐ, అణ్వాయుధాలు వంటి అంశాలపై చర్చించే అవకాశం ఉంది. ఇరు దేశాల మధ్య ఇప్పటికే అమలులో ఉన్న కీలక ఖనిజాల ఒప్పందాన్ని పొడిగించే విషయం కూడా చర్చలలో ప్రస్తావనకు వస్తుందని అమెరికా అధికారులు తెలిపారు. గత ఆరు నెలల కాలంలో ఇరు దేశాల నేతలు ముఖాముఖి చర్చలు జరపడం ఇదే మొదటిసారి. రెండు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలను తిరిగి గాడిలో పెట్టడం, ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయిల్ యుద్ధం తదితర అంశాలపై కూడా ఇరువురు నేతలు చర్చించే అవకాశం ఉంది. బుధవారం బీజింగ్ చేరుకునే ట్రంప్ గురు, శుక్ర వారాలలో జిన్‌పింగ్‌తో సమావేశమవుతారు. 2017 తర్వాత చైనాలో ట్రంప్ పర్యటించడం ఇదే మొదటిసారి.

**ఇరాన్ ఏం కోరింది?** యుద్ధం కారణంగా తనకు జరిగిన నష్టానికి పరిహారం అందజేయాలని టెహ్రాన్ డిమాండ్ చేసిందని ఇరాన్ ప్రభుత్వ టీ వీ తెలిపింది. తన ఓడరేవుల దిగ్బంధానికి అమెరికా స్వస్తి చెప్పాలని, ఇకపై దాడులు చేయబోనని హామీ ఇవ్వాలని, ఆంక్షలను తొలగించాలని, ఇరాన్ చమురు అమ్మకాలపై విధించిన నిషేధాన్ని ఎత్తివేయాలని కూడా టెహ్రాన్ కోరిందని ఇరాన్ ప్రభుత్వ వార్తా సంస్థ తస్నిమ్ వివరించింది. ఇరాన్ ప్రతిపాదనలను పరిశీలించిన వెంటనే ట్రంప్ తన సామాజిక మాధ్యమ వేదిక ట్రూత్ సోషల్‌లో ఓ పోస్ట్ పెడుతూ 'నేను దీనిని ఇష్టపడడం లేదు…అది ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదు' అని రాసుకొచ్చారు.

# భవిష్యత్ సాంకేతిక రంగాల్లో యువతకు భారీ అవకాశాలు







(మొదటిపేజీ తరువాయి)
సాధిస్తుందని అన్నారు. మొతమ్మీద ఇది ఒక జాతీయ టాస్క్ అని, దీన్ని అందరూ కలిసికట్టుగా సాధించాలని ఆయన కోరారు.

**మోదీ నాయకత్వంలో భారత్ అగ్రగామి**

దేశానికి సరైన సమయంలో సరైన నాయకుడిగా ప్రధాని నరేంద్ర మోదీ లభించారని చంద్రబాబు ప్రశంసించారు. సంస్కరణల వాది అయిన మోదీ నేతృత్వంలో భారత్ ప్రపంచంలో అగ్రస్థానానికి చేరుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం దేశంలో సుస్థిరమైన ప్రభుత్వాలు ఉన్నాయని, ఇది అభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు. ఒకప్పుడు దేశానికే ఆదర్శంగా నిలిచిన పశ్చిమ బెంగాల్, గత కొంతకాలంగా అభివృద్ధి ఆలోచనలే లేకుండా వెనుకబడిపోయిందని ఆయన అభిప్రాయపడ్డారు. 1990లలో పీవీ నరసింహారావు ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలు దేశానికి ఎన్నో అవకాశాలు కల్పించాయని, టెలికాం, విద్యుత్, రహదారుల రంగాల్లో విప్లవాత్మక మార్పులు వచ్చా యని గుర్తుచేశారు. ఆ సంస్కరణల్లో తాను కూడా భాగస్వామిని కావడం సంతోషంగా ఉందన్నారు.



**ఆదర్శంగా ఆంధ్రప్రదేశ్**

ప్రధాని ఆశయాలకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ ఇప్పటికే పలు చర్యలు చేపడుతోందని చంద్రబాబు వివరించారు. రాష్ట్రంలో 'ప్రోజ్యూమర్' (ఉత్పత్తిదారు-వినియోగదారు) విధానాన్ని ప్రోత్సహిస్తున్నామని, సోలార్ రూఫ్‌టాప్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నామని తెలిపారు. మైక్రో గ్రిడ్ వ్యవస్థ ద్వారా విద్యుత్ సరఫరా నష్టాలను తగ్గిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 20 లక్షల మంది రైతులు 20 లక్షల ఎకరాల్లో ప్రకృతి సేద్యం చేస్తున్నారని, దీని ద్వారా భూసారాన్ని పెంచుతూ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతున్నామని వివరించారు. ప్రతీ సవాలు ఒక అవకాశాన్ని సృష్టిస్తుందని, భారత్ ఎదుగుదలను ఎవరూ ఆపలేరని (అన్‌స్టాపబుల్), త్వరలోనే దేశం ఒక గ్లోబల్ జెయింట్‌గా మారుతుందని చంద్రబాబు అన్నారు. దేశ, రాష్ట్ర ప్రయోజనాలే తన అజెండా అని ఆయన స్పష్టం చేశారు.

# నీట్ పేపర్ లీక్!

- దర్యాప్తు జరపాలని రాజస్థాన్ సర్కార్ ఆదేశం
- బిజెపి ప్రభుత్వ నిర్లక్ష్యంపై విమర్శలు




**జైపూర్ – ఆంధ్రనాడు, మే 11**

దేశవ్యాప్తంగా వైద్య విద్యార్థులు పోటీ పడే అత్యంత కీలకమైన నీట్( ఎన్ఇఇటి) పరీక్ష-2026 పేపర్ లీక్ కావడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. గత వారం మూడవ తేదీన జరిగిన ఈ పరీక్షకు ముందే "గెస్ పేపర్" పేరిట అసలు ప్రశ్నా పత్రంలో ఉన్న ప్రశ్నలు చేతులు మారాయి. దీనిపై విమర్శలు రావడంతో ఎట్టకేలకు రాజస్థాన్ పోలీసు స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ (ఎస్ఓజి) దర్యాప్తు చేపట్టాలని బిజెపి ప్రభుత్వం ఆదేశించింది. అయితే నీట్ పరీక్షకు 15 రోజుల నుండి ఒక నెల ముందే సుమారు 410 ప్రశ్నలు గల గెస్ పేపర్ విద్యార్థుల మధ్య చక్కర్లు కొట్టింది. వాటిలో దాదాపు 120 ప్రశ్నలు కెమిస్ట్రీ విభాగంలో అచ్చుగుద్దినట్టు వచ్చాయని తేలింది. పరిక్షకు రెండు రోజుల ముందు రూ.5 లక్షలు, ఒక గంట ముందైతే రూ.30 వేలు అమ్మారని అధికారుల ప్రాథమిక దర్యాప్తులో తేలడం గమనార్హం. ఈ వివాదంపై రాజస్థాన్ ఎస్ఓజి అదనపు డైరెక్టర్ జనరల్ విశాల్ బన్సల్ సోమవారం మాట్లాడుతూ "ఈ గెస్ పేపర్ విషయంలో ఏదైనా మోసం లేదా నేరపూరిత కార్యకలాపాలు జరిగాయా అని మేం దర్యాప్తు చేస్తున్నాం. ఇప్పటివరకు ఎటువంటి అరెస్టులూ చేయలేదు" అని అన్నారు. మొత్తం 720 మార్కులకు జరిగే పరీక్షలో 600 మార్కులకు సమానమైన ప్రశ్నలు కొందరు అభ్యర్థులకు ముందే తెలిసిపోయాయని, ఇది నిజమైతే పరీక్ష ప్రక్రియ ప్రశ్నార్థకమవుతుందని, పరిక్షను సక్రమంగా నిర్వహించడంలో బిజెపి ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని నిపుణులు విమర్శిస్తున్నారు. అయితే దీనిపై పరీక్ష నిర్వహణ సంస్థ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్ టి ఎ) పరిక్షలో అక్రమాలకు సంబంధించిన సమాచారం తమకు అందిందని, కేంద్ర సంస్థలకు అప్పగించామని తెలిపింది.

# చెత్త సేకరణపై అవగాహన

**పెద్దపంజాణి, ఆంధ్రనాడు, మే 11 :** మండలంలోని రాజుపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని రాజుపల్లి, కమ్మినయనపల్లి, సోనేపల్లి గ్రామాల్లో స్వర్ణ గ్రామ సిబ్బంది సోమవారం ఇంటిఇంటికి వెళ్లి తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించి చెత్తను బహిరంగ ప్రదేశాల్లో పారేయకుండా గ్రామపంచాయతీ ద్వారా సేకరిస్తున్న చెత్త బండిలో వేయాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చెత్త సేకరణపై ఐవీఆర్ఎస్ ఫోన్ సర్వే చేస్తుండడంతో ప్రభుత్వం నుండి ఫోన్ వచ్చినప్పుడు ఫోన్ స్వీకరించి మీకు నచ్చిన సమాధానాన్ని తెలియజేయాలని కోరారు. ఈనెల 31వ తేదీ లోపు ఇంటి పన్ను చెల్లిస్తే 5/- రాయితీగలదని కలదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ అభివృద్ధి అధికారి రిజ్వానా, స్వర్ణగ్రామ సిబ్బంది చంద్ర నాయక్, గోపి, అరుణకుమారి, నాగవేణి, గ్రామస్తులు భాను ప్రతాప్ రెడ్డి, ప్రశాంత్, మునిరెడ్డి, మునింద్ర, సుబ్రమణ్యం, తరుణ్, పవన్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమి కబ్జా



**నాగలాపురం – ఆంధ్రనాడు, మే 11:** నాగలాపురం మండలం టి పి కోట గ్రామపంచాయతీలో ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యంతో దర్జాగా ప్రభుత్వ భూమి కబ్జా. వివరాలు ఇలా గ్రామ సచివాలయం ఆవరణంలో గ్రామస్తుడు దాదాపుగా 10 అడుగుల వరకు ప్రభుత్వ భూమిని కబ్జా చేయడం జరిగింది. కళ్ళ ముందే ప్రభుత్వ భూమి కబ్జా చేస్తున్న పంచాయతీ కార్యదర్శి, గ్రామ రెవెన్యూ అధికారి ఏమి పట్టించుకోవడం లేదంటూ గ్రామస్తుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో గ్రామస్తులు మాట్లాడుతూ దాదాపుగా నాలుగు సంవత్సరాల నుండి గ్రామ రెవెన్యూ అధికారిగా పనిచేస్తున్న అధికారి నిర్లక్ష్యం వల్లనే పంచాయతీ కార్యాలయం వెనక భాగాన ప్రభుత్వ భూమి కబ్జా కావడం జరుగుతుందని, ఏదో వచ్చాం?? చూసాం?? వెళ్ళాం?? అనే విధంగా వ్యవహరిస్తున్న గ్రామ రెవెన్యూ అధికారి గ్రామంలో ఎవరైనా చనిపోతే తప్ప గ్రామ పర్యటన చేయని గ్రామ రెవెన్యూ అధికారి. ఇలాంటి అధికారి వల్ల గ్రామానికి ఎటువంటి ఉపయోగం లేదని ఇప్పటికైనా తహసిల్దార్ స్పందించి నూతన గ్రామ రెవెన్యూ అధికారిని నియమించి గ్రామంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు. అలా లేని పక్షంలో గ్రామస్తులు శ్రీకాళహస్తి ఆర్డీవో, జిల్లా కలెక్టర్లు సంప్రదించి సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అర్జీ రూపంలో ఫిర్యాదు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దాదాపుగా ఆరు నెలలుగా వ్యక్తి ప్రహరీ గోడ నిర్మిస్తున్నారని గ్రామస్తులు తెలిపిన పట్టించుకోలేదని గుసగుసలాడుతున్నారు.

## మల్లయ్యకొండ గోశాలకు పశు గ్రాసం వితరణ



**తంబళ్లపల్లి – ఆంధ్రనాడు, మే 11:** తంబళ్లపల్లికి సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మల్లయ్యకొండ దేవస్థానం గోవులకు మేతగా ట్రాక్టర్ లోడు వరిగడ్డిని ఓ దాత విరాళంగా అందజేశారు. 2నెలల క్రితం మల్లయ్యకొండలో అగ్ని ప్రమాదం కారణంగా వందల ఎకరాల్లో అడవి కాలిపోగా.. పశువుల మేత, గడ్డి కాలి బూడిదయిపోయింది. దీంతో కొండ మీద వున్న దేవస్థానం గోవులకు మేత సమస్య తలెత్తింది. ఈ క్రమంలో తంబళ్లపల్లి మండలం గోపిదిన్నె పంచాయతీ కొత్తపల్లికి చెందిన మల్లికార్జున స్వామి అన్నదాన ట్రస్ట్ చైర్మన్ ఓ ట్రాక్టర్ వరి గడ్డిని సోమవారం మల్లయ్య కొండకు తీసుకువెళ్లి ఆలయ రికార్డు అసిస్టెంట్ కొండ కిట్టకు అందజేశారు. దాత దాతృత్వాన్ని ఆలయ ఈఓ మునిరాజ, అధికార సిబ్బంది, భక్తులు, ప్రజలు అభినందించారు.


# అమ్మవారి సేవలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి



**తిరుపతి రూరల్ – ఆంధ్రనాడు, మే 11:** తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కిరణ్మయి సోమవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయం వద్ద జస్టిస్ కిరణ్మయికి జిల్లా ప్రోటోకాల్ జడ్జి కోటేశ్వరరావు, ఆలయ ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ ముని చంగల్రాయులు, ఇన్స్పెక్టర్ ప్రసాద్, ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అమ్మవారి కుంకుమార్చన సేవలో పాల్గొన్న వారికి ఆలయ అధికారులు అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు.

# ఎంత కష్టమయ్యా.. సర్వేస్వరా

- సర్వే విధుల్లో సతమతం..
- సచివాలయ ఉద్యోగుల ఆవేదన!
- రీసర్వే లక్ష్యాలతో సర్వేయర్ల ఉక్కిరిబిక్కిరి
- రాత్రింబవళ్లు తప్పని పని ఒత్తిడి
- సాధారణ సర్వే విధులతో సతమతం
- అధికారుల టార్గెట్లతో తీవ్ర ఆవేదన
- ఒత్తిడి తాళలేక ఉద్యోగుల బేజారు
- ప్రత్యేక బృందాల ఏర్పాటుకు డిమాండ్



**యర్రావారిపాలెం, మే 11, ఆంధ్రనాడు:** రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రీసర్వే ప్రక్రియ గ్రామ సర్వేయర్ల పాలిట భారంగా మారింది. సచివాలయ వ్యవస్థలో అన్ని విభాగాల ఉద్యోగులు నిర్ణీత సమయానికి విధులు ముగించుకుని వెళ్తుంటే, సర్వేయర్లు మాత్రం రేయింబవళ్లు క్షేత్రస్థాయిలోనే గడపాల్సి వస్తోంది. ఉన్నతాధికారులు విధిస్తున్న కఠినమైన గడువులు, రోజువారీ లక్ష్యాలు వారి మానసిక స్థితిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. పగలు రీసర్వే, రాత్రి సాధారణ దరఖాస్తుల వెరిఫికేషన్‌తో విశ్రాంతి అన్నదే కరువైందని వారు వాపోతున్నారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే విధుల్లో కొనసాగడం కష్టమని భావిస్తూ కొందరు రాజీనామా బాట పట్టడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. తిరుపతి జిల్లాతోపాటు రాష్ట్రవ్యాప్తంగా ఇదే ఆందోళన వ్యక్తమవుతోంది.

**రీసర్వే లక్ష్యాల ఉచ్చులో సిబ్బంది – లక్ష్యాల వేటలో ప్రాథమిక హక్కుల ఉల్లంఘన**

రాష్ట్ర ప్రభుత్వం భూ రికార్డుల ప్రక్షాళన కోసం చేపట్టిన రీసర్వే కార్యక్రమం గ్రామ సర్వేయర్లపై పెను భారాన్ని మోపింది. ఉన్నతాధికారులు నిర్దేశించిన గడువులోపు గ్రామాల వారీగా సర్వే పూర్తి చేయాలనే ఒత్తిడి కారణంగా, సర్వేయర్లు పగటిపూట ఎండనక వాననక పొలాల్లోనే గడపాల్సి వస్తోంది. సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఈ పనికి ఏకాగ్రత అవసరమైనప్పటికీ, తక్కువ సమయంలో ఎక్కువ పని పూర్తి చేయాలనే ఆరాటం వల్ల సర్వేయర్లు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇది కేవలం శారీరక శ్రమ మాత్రమే కాకుండా, ఏ చిన్న పొరపాటు జరిగినా జవాబుదారీతనం వారిపైనే ఉండటంతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారు.

**సాధారణ విధుల నిర్వహణలో సవాళ్లు – ద్వంద్వ బాధ్యతలతో సతమతమవుతున్న యంత్రాంగం**

రీసర్వే అనేది ఒక ప్రత్యేక ప్రాజెక్టు అయినప్పటికీ, ప్రజల నుంచి వచ్చే సాధారణ సర్వే దరఖాస్తులను కూడా గ్రామ సర్వేయర్లే పర్యవేక్షించాల్సి రావడం సమస్యను జటిలం చేస్తోంది. పగలు మొత్తం క్షేత్రస్థాయిలో రీసర్వే పనుల్లో ఉండటంతో, మీ–సేవ ద్వారా వచ్చే భూ మార్పిడి, విభజన వంటి సాధారణ దరఖాస్తుల వెరిఫికేషన్ కోసం వారు రాత్రి సమయాలను కేటాయించాల్సి వస్తోంది. ఒకే వ్యక్తి రెండు రకాల భారీ బాధ్యతలను మోయడం వల్ల పని నాణ్యత తగ్గడమే కాకుండా, వ్యక్తిగత జీవితం పూర్తిగా అస్తవ్యస్తమవుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**వివక్షపై ఉద్యోగుల అసంతృప్తి – సమాన హోదా – అసమాన పని భారం**

గ్రామ సచివాలయాల్లో సుమారు పదిమంది ఉద్యోగులు వివిధ శాఖలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇతర శాఖల ఉద్యోగులు సాయంత్రం 5 గంటలకే తమ విధులు ముగించుకుని ఇంటికి వెళ్లే అవకాశం ఉండగా, కేవలం రెవెన్యూ విభాగానికి చెందిన సర్వేయర్లు మాత్రమే సెలవు దినాల్లో కూడా పని చేయాల్సి రావడంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. అందరం ఒకే రకమైన ఉద్యోగ నియామక ప్రక్రియ ద్వారా వచ్చినప్పుడు, కేవలం ఒక విభాగంపైనే ఇంతటి పనిభారం ఎందుకని వారు ప్రశ్నిస్తున్నారు. ఈ అసమానతలు ఉద్యోగుల మధ్య సమన్వయ లోపానికి కూడా దారితీసే అవకాశం ఉంది.

**ఉద్యోగాల వదిలివేత: తీవ్రమవుతున్న సంక్షోభం – ఒత్తిడి భరించలేక రాజీనామా బాట**

ప్రభుత్వ ఉద్యోగం సాధించడం ఎంతో శ్రమతో కూడుకున్న పని అయినప్పటికీ, ప్రస్తుత పని ఒత్తిడిని తట్టుకోలేక కొందరు సర్వేయర్లు తమ ఉద్యోగాలను వదులుకోవడం ఆందోళన కలిగించే అంశం. నిరంతరం టార్గెట్ల వేట, అధికారుల వేధింపులు, కుటుంబానికి సమయం కేటాయించలేకపోవడం వంటి కారణాల వల్ల యువ ఉద్యోగులు తీవ్ర నిరాశలో ఉన్నారు. ఒకవైపు అనుభవం ఉన్న సిబ్బంది కొరత ఏర్పడుతుంటే, ఉన్నవారు కూడా ఒత్తిడి వల్ల తప్పుకుంటుండటం సర్వే ప్రక్రియపై ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదం ఉంది.

**పరిష్కార మార్గాల దిశగా డిమాండ్లు – ప్రత్యేక బృందాల ఏర్పాటు అత్యవసరం**

ప్రస్తుత సంక్షోభాన్ని నివారించాలంటే ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సర్వేయర్లు కోరుతున్నారు. రీసర్వే కోసం ప్రత్యేక బృందాలను నియమించి, సాధారణ సర్వే విధులను గ్రామ సర్వేయర్లకు అప్పగించడం వల్ల పని విభజన జరిగి ఒత్తిడి తగ్గుతుందని వారు సూచిస్తున్నారు. అలాగే, క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బందికి తగిన మౌలిక వసతులు కల్పించి, పని వేళల్లో వెసులుబాటు కల్పిస్తేనే ఈ ప్రతిష్టాత్మక పథకం విజయవంతమవుతుందని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. అధికారులు కేవలం టార్గెట్లపైనే కాకుండా, ఉద్యోగుల క్షేమంపై కూడా దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# రాజన్న ఫౌండేషన్‌కు అవార్డు




**రేణిగుంట – ఆంధ్రనాడు, మే 11:** రాజన్న ఫౌండేషన్‌కు జాతీయ స్థాయి బెస్ట్ రూరల్ డెవలప్‌మెంట్ ఇనిషియేటివ్ ఆఫ్ ది ఇయర్ 2026 అవార్డు అందుకున్నట్లు యాజమాన్యం ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్య మరియు నైపుణ్యాభివృద్ధి రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న రాజన్న ఫౌండేషన్ కు జాతీయ స్థాయిలో మరో ప్రతిష్టాత్మక గౌరవం లభించింది అన్నారు.న్యూఢిల్లీ లోని హయత్ సెంట్రిక్ హోటల్‌లో మే 11, 2026న నిర్వహించిన గ్లోబల్ సి ఎస్ ర్ ఔ ఇ ఎస్ జి సమ్మిట్ అండ్ అవార్డ్స్ 2026 కార్యక్రమంలో బెస్ట్ రూరల్ డెవలప్‌మెంట్ ఇనిషియేటివ్ ఆఫ్ ది ఇయర్ 2026 (ఎడ్యుకేషన్ ఔ స్కిల్ డెవలప్‌మెంట్) అవార్డును స్పెషల్ ఇంపాక్ట్ అవార్డ్స్ విభాగంలో రాజన్న ఫౌండేషన్ అందుకుంది. ఈ కార్యక్రమాన్ని మార్కెటింగ్ అండ్ బ్రాండ్ హెనాకోస్ సంస్థ నిర్వహించింది.ఈ అవార్డును రిటైర్డ్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ మరియు ప్రముఖ సేవాభావి శ్రీ వేద్ భూషణ్ సమక్షంలో ప్రదానం చేయగా, రాజన్న ఫౌండేషన్ తరపున హెడ్ సతీష్ రాళ్లపల్లి స్వీకరించారు. ఈ సందర్భంగా రాజన్న ఫౌండేషన్ వ్యవస్థాపకులు గల్లా రామచంద్ర నాయుడు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని యువతకు నాణ్యమైన విద్య, నైపుణ్య శిక్షణ మరియు ఆత్మవిశ్వాసాన్ని అందించడం ద్వారా వారి జీవితాల్లో స్థిరమైన మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో రాజన్న ఫౌండేషన్ పనిచేస్తోంది. ఈ అవార్డు మా బృందం చేస్తున్న అంకితభావంతో కూడిన సేవలకు జాతీయ స్థాయిలో వచ్చిన గుర్తింపు. భవిష్యత్తులో మరింత విస్తృత స్థాయిలో సేవలను అందించేందుకు ఇది మాకు ప్రేరణగా నిలుస్తుంది అని పేర్కొన్నారు. అమర రాజా గ్రూప్స్ చైర్మన్ గల్లా జయదేవ్ మాట్లాడుతూ సమాజ అభివృద్ధి అనేది కేవలం కార్పొరేట్ బాధ్యత మాత్రమే కాదు, అది ఒక దీర్ఘకాలిక కట్టుబాటు. గ్రామీణ యువతకు విద్య మరియు ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా సమగ్ర అభివృద్ధిని సాధించవచ్చు. రాజన్న ఫౌండేషన్ చేస్తున్న సేవలు వేలాది కుటుంబాల్లో ఆశలను నింపుతున్నాయి. ఈ జాతీయ అవార్డు సంస్థ చేస్తున్న సేవలకు నిదర్శనం అని తెలిపారు. గ్రామీణ యువతకు విద్య నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో రాజన్న ఫౌండేషన్ చేస్తున్న కృషి జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకోవడం విశేషం అన్నారు.

# సమాజ చైతన్య కారకుడు పాత్రికేయులు రాజగోపాల్

**చంద్రగిరి – ఆంధ్రనాడు, మే 11:** సీనియర్ పాత్రికేయులు రాజగోపాల్ సమాజ చైతన్య కారకుడని హిందూ సమాజ సంఘాలు ప్రశంసలు అందించాయి. చంద్రగిరిలోని రోడ్లు భవనాల అతిథి గృహంలో హిందూ సంఘాల ఆధ్వర్యంలో నారద మహాముని జయంతి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పత్రికా రంగంలో విశేష సేవలు అందిస్తున్న సీనియర్ పాత్రికేయులు, నిరాడంబరుడైన తెలగం రాజగోపాల్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సృష్టి కర్త అయిన బ్రహ్మ మానస పుత్రుడు నారద మహాముని కలహభోజనుడు కాదని, లోక కల్యాణ కారకుడన్నారు. త్రి లోకాలు తిరుగుతూ అప్పట్లోనే విష్ణు భగవానుని, ధర్మాన్ని సమాజానికి చేరవేసిన తొలి పాత్రికేయుడుగా అభివర్ణించారు. వార్తను సమాజ హితానికి అందించే ప్రతి విలేఖరి నారద మహర్షికి మారు పేరుగా కొనియాడారు. లోక కళ్యాణార్థం వార్తా ప్రసారం చేసిన ఆధ్యుడు శ్రీ నారద మహాముని అని ఆయన స్ఫూర్తితోనే నేటి పత్రికా రంగం నడుస్తోందన్నారు. అక్షరమనే ఆయుధంతో ప్రజా సమస్యలను వెలుగులోకి తెస్తూ సమాజ చైతన్యం కోసం కృషి చేస్తున్న పాత్రికేయులను గౌరవించుకోవడం ఎంతో ఆనందంగా భావిస్తున్నామన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన విశ్రాంత ప్రధాన ఉపాధ్యాయులు ఒ. త్యాగరాజు హిందూదేశ ప్రాశస్త్యాన్ని, హిందూ ధర్మాన్ని చక్కగా వివరిస్తూ దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు. కార్పొరేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిన పత్రికా రంగంలో ప్రస్తుతం పాత్రికేయులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని వివరించారు. విశిష్ట అతిథిగా హాజరైన క్రీడాభారతి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి పాదిరి ధనంజయ రెడ్డి మాట్లాడుతూ వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రపంచానికి మన శాస్త్రాలే పునాదులని తెలియజేసారు. వేదాలు, పురాణ, భగవద్గీత సారాంశాలను కొట్టి పారాలేయమన్నారు. క్రీడా భారతి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి పాదిరి ధనుంజయ రెడ్డి సీనియర్ పాత్రికేయులు తెలగం రాజగోపాల్‌ని దుశ్శాలువతో సత్కరించి అభినందించారు. అనంతరం ముఖ్య అతిథిగా విచ్చేసిన విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఒ. త్యాగరాజు రాజగోపాల్ కి రూ. 1001/– నగదు పురస్కారాన్ని అందజేసి వారి సేవలను కొనియాడారు. హిందూ సంఘం నాయకుడు జంగం రుపేంద్ర, భరతమాత చిత్రపటాన్ని బహుకరించి తన గౌరవాన్ని చాటుకున్నారు. సన్మాన గ్రహీత రాజగోపాల్ మాట్లాడుతూ తన సేవలను గుర్తించి, పత్రికా రంగ ఆద్యుడైన నారద మహర్షి జయంతిని పురస్కరించుకొని తనను గౌరవించడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. ఈ పురస్కారం తన బాధ్యతను మరింత పెంచిందని, నిరంతరం సమాజ హితం కోసం పనిచేస్తానని నన్నారు. ఈ కార్యక్రమంలో హిందూ సంఘాల నాయకులు జింకా తిరుమలేష్,పాదిరి ధనంజయ్ రెడ్డి, సుధాకర్, ఒడుగు మనోజ్, జగన్, మహేష్, లోహిత్, భాస్కర్ రెడ్డి మరియు ఇతర నాయకులు పాల్గొన్నారు.



# బెంగుళూరు ఎయిర్‌పోర్టులో జగన్‌కు చెవిరెడ్డి స్వాగతం



**తిరుపతి రూరల్ – ఆంధ్రనాడు, మే 11:** యూరప్ పర్యటన ముగించుకుని సోమవారం తెల్లవారుజామున బెంగుళూరు అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి రాష్ట్ర ప్రభుత్వ మాజీ విప్, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆత్మీయ స్వాగతం పలికారు. ముందుగానే విమానాశ్రయం లోపలకు వె ళ్లిన చెవిరెడ్డి, బయటకు వచ్చిన జగ న్‌ను ఎదురేగి స్వాగతించారు. చెవిరె డ్డిని చూసిన జగన్ ఆప్యాయంగా పలకరిస్తూ ఆలింగనం చేసుకున్నారు. యూరప్ ప ర్యటన విజయవంతంగా పూర్తికావడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఈ సం దర్భంగా అక్కడున్న పార్టీ నాయకులు, అభిమానులు జగన్‌కు స్వాగతం పలికారు.

# రాజకీయ వేధింపులతో బంధాలు తెంచలేరు - చెవిరెడ్డి మోహిత్ రెడ్డి



**తిరుపతి రూరల్ – ఆంధ్రనాడు, మే 11:** తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలోని చెవిరెడ్డి నివాసంలో సోమవారం వైసీపీ నాయకులు, కార్యకర్తలకు ఐక్యత విందు నిర్వహించారు. ఇటీవల తిరుచానూరు ప్రాంతానికి చెందిన పలువురు వైసీపీ నేతలు, కార్యకర్తలపై నమోదైన కేసుల నేపథ్యంలో బెయిల్‌పై విడుదలైన వారు చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని కలిసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా చెవిరెడ్డి మోహిత్ రెడ్డి మాట్లాడుతూ రాజకీయ కక్షసాధింపులో భాగంగా తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారని ఆరోపించారు. అయితే అలాంటి ఒత్తిళ్లు, బెదిరింపులకు వైసీపీ కేడర్ భయపడదని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగుతుందని పేర్కొన్నారు. రాజకీయ వేధింపులతో నాయకులు, కార్యకర్తల మధ్య ఉన్న ఆత్మీయ బంధాలను ఎవరూ దెబ్బతీయలేరన్నారు. పార్టీ శ్రేణులతో అనుబంధం మరింత బలపడుతుందే తప్ప తగ్గదని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుచానూరు కు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తనపల్లిలో రొమ్మల ఫౌండేషన్ చలివేంద్రం

**- బాటసారులకు అన్నదానం, చల్లని పానీయాల పంపిణీ**



**తిరుపతి రూరల్ – ఆంధ్రనాడు, మే 11:** తిరుపతి రూరల్ మండలం, తనపల్లి సమీపంలో ప్రముఖ యువ పారిశ్రామికవేత్త, రొమ్మల ఫౌండేషన్ చైర్మన్ రొమ్మల రాజేష్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం చలివేంద్రం ప్రారంభించారు. వేసవి ఎండలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు, బాటసారులకు ఉపశమనం కలిగించే ఉద్దేశంతో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు రొమ్మల రాజేష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సుమారు 300 మందికి పైగా స్థానికులు, ప్రయాణికులకు అన్నదానం నిర్వహించడంతో పాటు కూల్‌డ్రింక్స్, వాటర్ బాటిల్స్, మజ్జిగ ప్యాకెట్లు, ఐస్‌క్రీములు, సోడాలను ఉచితంగా పంపిణీ చేశారు. రొమ్మల రాజేష్ రెడ్డి మాట్లాడుతూ.. ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజల ఆరోగ్య పరిరక్షణకు తమ ఫౌండేషన్ కట్టుబడి ఉందన్నారు. బాటసారులకు చల్లని పానీయాలు అందించడం ఆనందంగా ఉందని తెలిపారు. గతంలో కూడా ఉచిత హెల్మెట్లు, పెట్రోల్ పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించిన రాజేష్ రెడ్డి సేవలను స్థానికులు అభినందించారు. ఈ కార్యక్రమంలో రొమ్మల ఫౌండేషన్ ప్రతినిధులు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# మే 16న జాతీయ డెంగ్యూ దినోత్సవం




**తిరుపతి కలెక్టరేట్ – ఆంధ్రనాడు, మే 11:** మే నెల 16వ తేదీ జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకొని డెంగ్యూ వ్యాధి నివారణ, నియంత్రణకు సంబంధించిన అవగాహన బ్యానర్‌ను జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ కలెక్టర్ కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రూప్ కుమార్, మానిటరింగ్ సెల్ వైద్యాధికారి డాక్టర్ అభిజ్ఞ,సబ్ యూనిట్ అధికారులు, మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

# యస్వీయూలో జాతీయ సాంకేతిక దినోత్సవం

**- భారత అణుశక్తి విజయాలపై శాస్త్రీయ చర్చలు**
**- పిఎఫ్ బిఆర్ దేశ ఇంధన స్వయం సమృద్ధికి కీలకం**



**తిరుపతి – ఆంధ్రనాడు, మే 11 :** శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలోని ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ సాంకేతిక దినోత్సవం –2026 వేడుకలు సోమవారం సెనేట్ హాల్‌లో నిర్వహించారు. భారతీయ విజ్ఞాన మండలి (విజ్ఞాన భారతి ఆంధ్రప్రదేశ్ విభాగం), 'మై భారత్' చిత్తూరు – తిరుపతి విభాగాల సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది. భారత అణు సాంకేతిక పరిజ్ఞానంలో సాధించిన పురోగతి అంశంపై నిర్వహించిన సమావేశంలో భారతదేశపు ప్రోటోటైప్ ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్ (పిఎఫ్ బిఆర్) ప్రాధాన్యంపై చర్చించారు. దేశ ఇంధన భద్రత, సుస్థిర అణుశక్తి అభివృద్ధిలో పిఎఫ్ బిఆర్ కీలక పాత్ర పోషిస్తుందని వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐజీసీఏఆర్ మాజీ డైరెక్టర్ డాక్టర్ ఎన్. శివరామన్ హాజరయ్యారు. అతిథులుగా యస్వీయూ ఉపకులపతి ఆచార్య టాటా నరసింగరావు, ఐజీసీఏఆర్ ఫ్యూయల్ కెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ సి.వి.ఎస్. బ్రహ్మానందరావు పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ ఆచార్య జి. శ్రీనివాసులు, ఐఐఎస్ఈఆర్ తిరుపతి నుంచి డాక్టర్ అనిలాత్మజ ఆర్యసోమయాజుల, ఐఐటీ తిరుపతి నుంచి డాక్టర్ ప్రసన్న కుమార్ బెహరా ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ, మూడు అంచెల అణుశక్తి కార్యక్రమంలో పిఎఫ్ బిఆర్ వ్యూహాత్మక ప్రాధాన్యం కలిగిన ప్రాజెక్ట్ అని తెలిపారు. అణుశక్తి రంగంలో దేశ స్వయం సమృద్ధికి ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు. రోజంతా కొనసాగిన కార్యక్రమంలో ఆహ్వానిత ప్రసంగాలు, ఇంటరాక్టివ్ సెషన్లు, అణు ఇంజనీరింగ్ సవాళ్లపై సాంకేతిక చర్చలు నిర్వహించినట్లు ఈఈఈ విభాగాధిపతి ఆచార్య జెఎన్.చంద్రశేఖర్ తెలిపారు.




# పాతపాలెం రైతుల భూ సమస్యల పరిష్కారానికి వినతి

**- అటవీ శాఖ వేధింపులు నిలిపివేయాలని తహసిల్దార్‌కు ఫిర్యాదు**



**కేవీబీపురం – ఆంధ్రనాడు, మే 11:** కేవీబీ పురం మండలంలోని పాతపాలెం గ్రామ ప్రజలు ఏళ్లుగా ఎదుర్కొంటున్న భూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు మునస్వామి యాదవ్ సోమవారం తహసిల్దార్ తనుజాకు వినతిపత్రం సమర్పించారు. గ్రామస్తులు, రైతులతో కలిసి తహసిల్దార్ కార్యాలయానికి చేరుకున్న ఆయన సమస్యల తీవ్రతను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మునస్వామి యాదవ్ మాట్లాడుతూ పాతపాలెం గ్రామానికి చెందిన పలువురు రైతులు తరతరాలుగా సాగు చేస్తున్న భూముల విషయంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా అటవీ శాఖ అధికారులు రైతులను తమ పొలాల వద్దకు వెళ్లకుండా అడ్డుకోవడం వల్ల వ్యవసాయ పనులు దెబ్బతింటున్నాయని తెలిపారు. భూముల హక్కుల విషయంలో స్పష్టత లేక రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. గ్రామస్తుల సమస్యలపై రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి భూ వివాదాలను శాశ్వతంగా పరిష్కరించాలని, అటవీ శాఖ అధికారుల వేధింపులను అరికట్టాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పాతపాలెం గ్రామానికి చెందిన రైతులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మొరం అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

**- హనుమాన్ జయంతి ఉత్సవంలో పాల్గొనాలని భక్తులకు పిలుపు**
**- ఆలయ ధర్మ కర్త.....రత్నా రెడ్డి**



**బైరెడ్డిపల్లి – ఆంధ్రనాడు, మే11:** బైరెడ్డిపల్లి టూ పలమనేరుకు వెళ్లే జాతీయ రహదారిలో పెంట గ్రామశీ కలదు. ఈ గ్రామం దట్టమైన అటవీ ప్రాంతంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో పచ్చని చెట్లు, వాగులు మధ్య 25 అడుగుల అభయ ఆంజనేయ స్వామి దేవాలయం కలదు. ఈ ఆలయాన్ని కొలమాసనపల్లి గ్రామానికి చెందిన రత్నా రెడ్డి అనే స్వచ్ఛంద సేవా కర్తగా పేరొంది,అందరి నోటా అమ్మగా పిలువబడే రతన్నమ్మ నిర్మించింది. స్వామి వారే స్వప్నంలో కంటపడి ఈ ఆలయాన్ని ఆమె చేతుల మీదగా నిర్మించుకొన్నాడు. నిర్మించిన నాటి నుండి నేటి వరకు కూడా ఆలయంలో నిత్యం స్వామి వారికి పూజా కైంకర్యాలు జరుగుతున్నాయి. ప్రతి నెలలో వచ్చే అమావాస్య, పౌర్ణమికి ఈ ఆలయంలో విశేష పూజలు, అన్నదాన కార్యక్రమాలు జరుగుతాయి. నేడు హనుమాన్ జయంతి సందర్భంగా ఆలయంలో సుప్రభాత సేవ, గోపూజ, అభిషేకం, అలంకరణ, కతీ త్రరాధన, సుదర్శన హోమం, రామతారక హోమం, అష్టోత్తర హోమం, సీతారామ కళ్యాణశీ, మహా మంగళ హారతి, తీర్థ ప్రసాదాలు వినియోగం జరుగునని తెలిపారు.

# ఫెయిల్‌కు చెక్... ఉత్తీర్ణతే లక్ష్యం

**- రెమిడీయల్ తరగతులను పరిశీలించిన ఎంఈఓ లక్ష్మీపతి**



**కేవీబీపురం – ఆంధ్రనాడు, మే 11:** మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో అనుత్తీర్ణులైన విద్యార్థినుల కోసం నిర్వహిస్తున్న రెమిడీయల్ తరగతులను సోమవారం మండల విద్యాశాఖాధికారి లక్ష్మీపతి పరిశీలించారు. విద్యార్థినుల అభ్యాస స్థాయిని తెలుసుకుని ఉపాధ్యాయులతో మాట్లాడిన ఆయన బలహీనంగా ఉన్న అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి బోధన కొనసాగించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎంఈఓ లక్ష్మీపతి మాట్లాడుతూ.. పరీక్షల్లో విఫలమైనంతమాత్రాన నిరుత్సాహానికి గురికాకుండా, భయాన్ని దూరం చేసి చదువుపై పూర్తి ఏకాగ్రతతో ముందుకు సాగాలని విద్యార్థినులకు ప్రోత్సాహం అందించారు. ప్రతి రోజు పునశ్చరణ చేయడం, సందేహాలను వెంటనే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. అలాగే ఉపాధ్యాయులతో మాట్లాడుతూ విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధంగా బోధన చేయడంతోపాటు ప్రతి విద్యార్థినిపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని సూచించారు. రెమిడీయల్ తరగతులు విద్యార్థినుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి ఉత్తీర్ణత సాధించే దిశగా కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అతివేగ ప్రయాణాలకు చెక్..

**- రెండు బస్సులు, ఒక టిప్పర్ సీజ్**
**- రూ.50 వేల జరిమానా**



**తిరుపతి కలెక్టరేట్ – ఆంధ్రనాడు, మే 11:** తిరుపతికి వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న కాంట్రాక్ట్ క్యారేజ్ బస్సుల్లో అమర్చిన స్పీడ్ లిమిటింగ్ డివైస్‌లు సక్రమంగా పనిచేస్తున్నాయా అనే అంశంపై జిల్లా రవాణాశాఖ అధికారి కొ్రపాటి మురళీమోహన్ ఆదేశాల మేరకు రవాణాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. అనుమానాస్పద వాహనాలను ఆటోమేటిక్ టెస్ట్ స్టేషన్‌కు తరలించి సాంకేతిక పరీక్షలు నిర్వహిస్తున్నారు. నిబంధనల ఉల్లంఘన గుర్తించిన వాహనాలను స్వాధీనం చేసుకుంటున్నారు. వాహన గరిష్ట వేగాన్ని నియంత్రించే స్పీడ్ లిమిటింగ్ డివైస్‌లు సెన్సార్లు, ఇంజిన్ కంప్యూటర్‌తో అనుసంధానమై పనిచేస్తూ చట్టబద్ధమైన వేగ పరిమితిని మించకుండా నిరోధిస్తాయి. అయితే కొందరు వాహన యజమానులు ఈ పరికరాల్లో సాంకేతిక మార్పులు చేసి అతివేగ ప్రయాణాలకు పాల్పడుతున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ నుంచి తిరుపతికి వచ్చిన రెండు కాంట్రాక్ట్ క్యారేజ్ బస్సులను మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు వనం వెంకట సుబ్రహ్మణ్యం, మోహన్ కుమార్ స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా త్రైమాసిక పన్నులు చెల్లించని ఒక టిప్పర్ వాహనాన్ని కూడా అధికారులు సీజ్ చేశారు. స్వాధీనం చేసిన వాహనాలపై సుమారు రూ.50 వేల మేర అపరాధ రుసుము, పన్నులు విధించినట్లు అధికారులు తెలిపారు. ప్రయాణికుల భద్రతకు భంగం కలిగేలా అతివేగంతో నడిచే కాంట్రాక్ట్ క్యారేజ్ బస్సులపై తనిఖీలు మరింత ముమ్మరం చేసి కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా రవాణాశాఖ అధికారి, వాహన తనిఖీ అధికారి కొ్రపాటి మురళీమోహన్ హెచ్చరించారు.

ANDHRANADU
TELUGU DAILY

మంగళవారం
12.05.2026

తిరుపతి – చిత్తూరు
అన్నమయ్య– అనంతపురం
ఆంధ్రనాడు

# గనుల శాఖలో ఈ-టెండర్లకు ఆహ్వానం

**- 10 రకాల మైనింగ్ కార్యకలాపాలకు ఈ-టెండర్లు**

**తిరుపతి కలెక్టరేట్ – ఆంధ్రనాడు, మే 11:** ఆంధ్రప్రదేశ్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఎండిసి) ఆధ్వర్యంలోని బ్లాక్ గెలాక్సీ గ్రానైట్, బ్లాక్ గ్రానైట్, ఇండస్ట్రియల్ ఉ మినరల్స్, కలర్ గ్రానైట్, బిల్డింగ్ మెటీరియల్ గనులలో మైనింగ్ కార్యకలాపాల నిర్వహణకు సంబంధించి 10 ఈ–టెండర్లకు కాంట్రాక్టర్ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గనులు, భూగర్భ శాఖాధికారి బాలాజీ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. టెండర్ పత్రాలు ఈ నెల 11వ తేదీ నుంచి 31వ తేదీ వరకు అందుబాటులో ఉంటాయని, ఆసక్తి గల కాంట్రాక్టర్లు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. టెండర్లకు సంబంధించిన పూర్తి వివరాలు ఏపీ ఈ ప్రొక్యూర్మెంట్ పోర్టల్, ఏపీఎండిసి అధికారిక వెబ్‌సైట్ లో పొందవచ్చని వెల్లడించారు. మరిన్ని వివరాలకు డిప్యూటీ మేనేజర్ బి.వి. పుల్లారెడ్డి (మొబైల్: 8008558562) ను సంప్రదించాలని జిల్లా గనులు, భూగర్భ శాఖాధికారి తెలిపారు..

# హ్యాండ్‌లూమ్ ఇనిస్టిట్యూట్‌లో ప్రవేశాల ఆహ్వానం

**- విద్యార్థులకు నెలకు రూ.2,500 స్టైపెండ్**

**- మే 30 వరకు దరఖాస్తుల స్వీకరణ**

**తిరుపతి కలెక్టరేట్ – ఆంధ్రనాడు, మే 11:** తిరుపతి జిల్లా వెంకటగిరిలోని శ్రీ ప్రగడ కోటయ్య మెమోరియల్ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్ లూమ్ టెక్నాలజీలో 2026–27 విద్యా సంవత్సరానికి హ్యాండ్‌లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ టెక్నాలజీలో 3 సంవత్సరాల డిప్లొమా కోర్సుకు ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సంస్థ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ (ఎంపీసీ), రెండేళ్ల ఐటీఐ పూర్తి చేసిన అభ్యర్థులు నేరుగా రెండో సంవత్సరంలో చేరవచ్చని తెలిపారు. కోర్సు అభ్యసించే విద్యార్థులకు నెలకు రూ.2,500 స్టైపెండ్ అందించనున్నట్లు వెల్లడించారు. కోర్సు పూర్తి చేసిన వారికి క్యాంపస్ సెలక్షన్ల ద్వారా ఉద్యోగ అవకాశాలు ఉండటంతో పాటు చేనేత, జౌళి శాఖల ప్రభుత్వ ఉద్యోగాలకు కూడా అవకాశం ఉంటుందని తెలిపారు. ఉన్నత విద్యాభ్యాసం చేయదలిచిన వారు నేరుగా బీటెక్ రెండో సంవత్సరంలో ప్రవేశం పొందవచ్చన్నారు. వివరాలకు ఐఐహెచ్‌టి వెంకటగిరి అధికారిక వెబ్‌సైట్ను సందర్శించవచ్చని, దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ మే 30, 2026 అని అధికారులు తెలిపారు.

# సనాతన ధర్మ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత




**- సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగర సంకీర్తన**

**- అంగళ్లు గ్రామంలో ఘన స్వాగతం**

**కురబలకోట – ఆంధ్రనాడు, మే 11:** కురబలకోట మండలం అంగళ్లు సమీపంలోని గోల్డెన్ వ్యాలీ కళాశాలలో జరుగుతున్న రాష్ట్రస్థాయి ధర్మప్రచారకులు, ధర్మ విస్తారకుల శిక్షణా కార్యక్రమంలో భాగంగా ఆదివారం నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగళ్లు గ్రామ వీధుల్లో నిర్వహించిన సంకీర్తనకు గ్రామస్తులు మంగళహారతులతో, పూలు చల్లి ఘన స్వాగతం పలికారు. భక్తి గీతాలు, నామ స్మరణలతో గ్రామమంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో పాల్గొన్న సమరసత సేవా ఫౌండేషన్ ప్రాంత ప్రముఖ్ శ్రీ కొండారెడ్డి మాట్లాడుతూ, ప్రాచీన కాలం నుంచి భారతీయ గ్రామాల్లో ఉదయ వేళ నగర సంకీర్తన సంప్రదాయం కొనసాగేదని తెలిపారు. విదేశీ పాలనలో మన సంస్కృతి, సంప్రదాయాలకు ఆటంకాలు ఏర్పడటంతో ఇటువంటి ఆచారాలు క్రమంగా తగ్గిపోయాయని పేర్కొన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను పూర్వ వైభవ స్థితికి తీసుకువెళ్లి సనాతన ధర్మాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. భారతదేశాన్ని మళ్లీ విశ్వగురువుగా నిలబెట్టేందుకు సమాజం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సాయిరాం, వెంగల్ రెడ్డి,జగన్నాథం, గంగాధర్, శ్రీధర్ రాజు, పూజారి వేణు, శ్రీనివాసులు, చంద్రశేఖర్ తదితరులు, అర్చకులు, ధర్మప్రచారకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఎంటీఎస్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్ వద్ద ఆందోళన




**మదనపల్లి – ఆంధ్రనాడు, మే 11:** ఎంటిఎస్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ఎంటీఎస్ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు యుటిఎఫ్ మద్దతు ప్రకటించి,ఆ సంఘ ఉద్యోగులు ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా జనరల్ సెక్రెటరీ హేమావతి మాట్లాడుతూ 1998 డీఎస్సీలో అర్హత సాధించిన సభ్యులు ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించారన్నారు. అయితే వీరికి సాధారణ ఉపాధ్యాయ, ఉద్యోగులకు వర్తించినట్లు 62 ఏళ్ల రిటైర్ మెంట్ వర్తించడం లేదన్నారు. దీనిని ప్రభుత్వం గుర్తించి రిటైర్మెంట్ వయసును 62కు పెంచాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రిటైర్ అయిన ఉద్యోగులకు పెన్షన్ మంజూరు చేయాలని, సర్వీసులో ఉన్న ఉద్యోగస్తులకు హెల్త్ కార్డులు ఇవ్వాలని కోరారు. అనంతరం జిల్లా కలెక్టరును కలిసి మెమొరాండం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంటిఎస్ ఉద్యోగులు కృష్ణారెడ్డి, విశ్వనాథ్ రెడ్డి, రవి, ఆదినారాయణ, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 318 అర్జీలు

**- అర్జీలపై నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవు**

**- జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్**



**తిరుపతి కలెక్టరేట్ – ఆంధ్రనాడు, మే 11:** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో వచ్చిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజల నుంచి మొత్తం 318 అర్జీలు స్వీకరించారు. అర్జీదారుల సమస్యలను సావధానంగా విని, సకాలంలో పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. పెండింగ్‌లో ఉండే అర్జీలు లేకుండా, అర్జీదారులు సంతృప్తి చెందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు శివశంకర్ నాయక్, భరత్ నాయక్, రోజ్‌మాండ్, అనురాధ పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. శాఖల వారీగా రెవెన్యూ శాఖకు అత్యధికంగా 185 అర్జీలు రాగా, పంచాయతీరాజ్‌కు 29, హోమ్ శాఖకు 17, సర్వే అండ్ ల్యాండ్‌కు 17, ఏపీ రెసిడెన్షియల్ స్కూల్స్‌కు 10 అర్జీలు అందాయి. మిగిలిన అర్జీలు వివిధ శాఖలకు సంబంధించినవిగా అధికారులు తెలిపారు.

# ఆరు అడుగుల గుంత కోసం అగుచాట్లు... కార్యాలయాలు చుట్టూ కాళ్ళు అరిగేలా ప్రదక్షిణలు

**- స్మశాన వాటిక దారి కోసం తహశీల్దార్ కార్యాలయం బాట పట్టిన ..... కడపనత్తశీ గ్రామస్థులు**

**- గ్రామస్థులు 10 సార్లు అర్జీ ఇచ్చిన నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులు**

**- గ్రామశీ ఏర్పడిన నాటి నుండి వెళ్తున్న దారిని ఆక్రమణ చేసారంటూ గ్రామస్థులు మండి పాటు**

**- సమస్య పరిష్కారం కాకపోతే ఆందోళనలకు సిద్ధం అంటున్న గ్రామం**



**బైరెడ్డిపల్లి – ఆంధ్రనాడు, మే 11:** మండలంలోని కడపనత్తం గ్రామశీలో నివసిస్తున్న ప్రజలకు చెప్పుకోలేని కష్టం ఎదురుపడ్డది. గ్రామశీలో ఎవరు మరణించిన శవాన్ని స్మశాన వాటికకు తీసుకెళ్లాలశీటే తల ప్రాణం తోకకు వస్తున్నది. చనిపోయిని శవాన్ని పూడ్చాలంటే ఇంత దారుణమా అనే ప్రశ్నలు వారిలో వారే వేసుకొనే విధంగా వెంటపడుతున్నాయని గ్రామస్థులు ఈ సమస్యను ఎలాగైనా అదికమించాలని తహశీల్దార్ కార్యాలయం బాట పట్టి సుమారు 10 సార్లు అర్జీలు కూడా ఇచ్చి, నెలకొన్న సమస్యను సశీబంధిత అధికారులకు గ్రామస్థుల గోడు విన్నవించారు. కానీ ఆ సమస్య పై స్పందించిన పాపాన పోలేదు. చివరి సారి అర్జీ ఇచ్చి సమస్య పరిష్కారం చేయమని కోరుదాం.. పరిష్కరించకపోతే ఇక ఆందోళన,నిరసన శంణ్యం అంటూ గ్రామమే సోమవారం కదిలింది. కానీ కార్యాలయం బాట పడితే తహశీల్దార్ లేకపోవడంతో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సిబ్బంది ఫిర్యాదు అందుకొని సమస్యను అధికమిస్తామని భరోసా ఇవ్వడంతో గ్రామస్థులు వెనుతిరిగారు. ఈ సందర్భంగా స్థానిక గ్రామస్థులు మురళీధర్, దామోదర్ నాయుడు, శ్రీరాములు మాట్లాడుతూ గ్రామశీ ఏర్పడిన నాటి నుండి సర్వే నంబర్ 222లో 67 సెంట్లు గల భూమిలో గ్రామానికి చెందిన బీసీ,ఓ సీ కులాల్లో మృతి చెందిన వారిని వంక పోరశీబోకు స్థలం గుండా శవాన్ని తీసుకెళ్లి దహన క్రియలు నిర్వహించేవాళ్ళం. కానీ వంక పోరంబోకు స్థలాన్ని టిఎన్ కుప్పం గ్రామానికి చెందిన వేమారెడ్డి అనే రైతన్న ఆక్రమణ చేసి, దహన క్రియాలకు ఇబ్బందుకరమైన వాతావరణం సృష్టిస్తున్నాడని తెలిపారు. 6 అడుగుల గుంత కోసం అగుచాట్లు పడి దహన క్రియలు చెయ్యాలశీటే ప్రతీసరీ గ్రామస్తులు నరకం అనుభవించాల్సిదేనని తీవ్ర ఆవేదన గురైనారు.

**గ్రామస్థుల డిమాండ్.....**

సుమారు 500 మీటర్లు వంక పోరంబోకు స్థలం ఉన్నది. కొన్ని ఏళ్లుగా దహన క్రియలకు ఈ దారి గుండానే వెళ్తున్నాం. కానీ వేమారెడ్డి అనే రైతన్న మేము వెళ్లే దారిని జెసిబీ సాయశీతో ఆక్రమణ చేసి, మా గ్రామానికి ఇబ్బంది పెడుతున్నారు. ఇదే సమస్యపై పలుమార్లు పిర్యాదు చేశాం. కానీ పరిష్కరించిన పాపాన పోలేదు. సమస్య పరిష్కారం కాకపోతే కార్యాలయాలు ముట్టడించి, జాతీయ రహదారి పై ధర్నాలు చేయాల్సిన పరిస్థితి వస్తుందని సంబంధిత అధికారులకు గ్రామస్థులు చురకులు అంటించారు. కార్యక్రమంలో కడప నత్తశీ గ్రామస్థులు పాల్గొన్నారు.

# డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సిఎండి'కి 54 వినతులు



**తిరుపతి, ఆంధ్రనాడు, మే 11:** ఏపీఎస్పీడీసీఎల్ కార్పొరేట్ ఆఫీసులో సోమవారం ఉదయం నిర్వహించిన 'డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సిఎండి' కార్యక్రమానికి 54 వినతులు అందినట్లు ఆ సంస్థ చైర్మన్ ఉ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. ఈ కార్యక్రమం సందర్భంగా పలువురు వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు, సిబ్బంది కృషి చేయాలని సిఎండి సూచించారు. ఈ కార్యక్రమం ద్వారానే కాకుండా వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్లు: 1912 లేదా 1800 425 155333కు కాల్ చేయడం లేదా వాట్సాప్ నంబరు: 91333 31912కు చాట్ చేయడం ద్వారా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, పరిష్కరించుకోవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ ఉ ఐటి) పి. అయూబ్ ఖాన్, డైరెక్టర్ (టెక్నికల్ ఉ హెచ్‌ఆర్ డి) కే. గురవయ్య, డైరెక్టర్/ ఫైనాన్స్ (ఎఫ్ఎసి) కె. రామమోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు కె. ఆదిశేషయ్య, జె. రమణా దేవి, ఆర్. పద్మ, ఎం. మురళి కుమార్, ఎన్. శోభా వాలెంటీనా, ఎం. ఉమాపతి, కే. సంపత్ కుమార్, సిహెచ్ రామచంద్ర రావు, ఎస్. రమణ, జనరల్ మేనేజర్లు జగదీష్, భాస్కర్ రెడ్డి, లత తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ సాంకేతిక దినోత్సవం ఘనంగా నిర్వహించిన మిట్స్ యూనివర్సిటీ




**కురబలకోట – ఆంధ్రనాడు, మే 11:** మదనపల్లి సమీపంలోని మదనపల్లి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (మిట్స్) డీమ్డ్ టు బి యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ సాంకేతిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మిట్స్ ఐఐసీ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మిట్స్ పూర్వ విద్యార్థి, బెంగళూరుకు చెందిన ఖైద్రే సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ ఎమ్. గంగాధర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక విజ్ఞానం దేశాభివృద్ధికి కీలకమని పేర్కొన్నారు. యువత సృజనాత్మక ఆలోచనలు, నూతన ఆవిష్కరణల ద్వారా సమాజానికి సేవ చేయాలని సూచించారు. కృత్రిమ మేధస్సు, సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, ఆటోమేషన్, ఆరోగ్య రంగాల్లో సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతున్న తీరును వివరించారు. విద్యార్థులు తమ నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకుంటూ ఆధునిక సాంకేతిక ధోరణులకు అనుగుణంగా ముందుకు సాగాలని సూచించారు. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకోవడం, స్టార్టప్‌లు, పరిశోధనల వైపు అడుగులు వేయడం అవసరమన్నారు. కొత్త టెక్నాలజీలపై అవగాహన పెంపొందించుకొని ప్రాక్టికల్ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటే ప్రపంచస్థాయి అవకాశాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ ఎమ్. శ్రీదేవి, కోఆర్డినేటర్లు బి. ప్రశాంత్, వి. గీతతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# గంగమ్మకు సారె సమర్పణ



**తిరుపతి – ఆంధ్రనాడు, మే 11:** తిరుపతి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ సుగుణమ్మ తిరుపతి గుదేశం పార్టీ యువ నాయకురాలు బట్టే వెంకట కీర్తి వారి కుటుంబ సభ్యులు పార్టీ నాయకులతో కలిసి ఈరోజు తాతయ్యగుంట గంగమ్మ తల్లికి భక్తిశ్రద్ధలతో సారె సమర్పించి తదుపరి ప్రసాదాలు పంపిణీ చేయడం జరిగినది. ఈ సందర్భంగా సుగుణమ్మ మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు తీసుకొని తిరుపతి ప్రజలు సుఖశాంతులతో ఉండాలని ప్రార్థించారు. తయ్యగుంట గంగమ్మ తల్లి తిరుపతి ప్రజల ఆరాధ్య దైవం. ప్రతి సంవత్సరం జరిగే గంగమ్మ జాతర ఆధ్యాత్మికతకు, సంప్రదాయాలకు ప్రతీక. అమ్మవారి కృపతో తిరుపతి ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, యువతకు మంచి భవిష్యత్తు కలగాలని ప్రార్థించాము. ఈ కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక భక్తులు పాల్గొన్నారు.

# ఘనంగా టిడిపి నాయకులు కట్ట దొరస్వామి నాయుడు జన్మదిన వేడుకలు



**కురబలకోట – ఆంధ్రనాడు, మే 11:** మొలకలచెరువులో టిడిపి టీఎస్ఎన్వి మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కట్ట దొరస్వామి నాయుడు జన్మదిన వేడుకలు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి భారీ సంఖ్యలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి వేడుకలను విజయవంతం చేశారు. పార్టీ జెండాలు, నినాదాలతో మొలకలచెరువు ప్రాంతం పసుపుమయంగా మారింది. స్థానిక మూడు రోడ్ల కూడలిలో భారీ కేక్ కోసం నాయకులకు కార్యకర్తలకు పంచిపెట్టారు. అనంతరం మూడు రోడ్ల కూడలి నుంచి కేజీఎన్ కళ్యాణ మండపం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కట్ట దొరస్వామి నాయుడు చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఆయన ఎప్పుడూ ముందుంటారని పేర్కొన్నారు. జన్మదిన వేడుకల సందర్భంగా పేదలకు అన్నదాన కార్యక్రమం, పండ్ల పంపిణీ, సేవా కార్యక్రమాలు నిర్వహించడం విశేషం. కార్యక్రమంలో బిజెపి సీ నియర్ నాయకులు చల్లపల్లి నరసింహారెడ్డి, బండి ఆనంద్, తంబళ్లపల్లి జనసేన ఇం చార్జ్ సాయినాథ్, జనసేన నాయకులు ఎం. ఎన్.చంద్రశేఖర్ రెడ్డి, రామచంద్ర, రా జంపేట పార్లమెంట్ టిడిపి ప్రధాన కార్యదర్శి పటాన్ ఖాదర్ ఖాన్, రాజంపేట బి సీ సెల్ అధ్యక్షులు పి.సురేంద్ర యాదవ్, టిడిపి నాయకులు అగ్రహారం కాలేశా, ఊరగా యల రామచంద్ర, కట్ట హరినాథ్, వెంకటస్వామి, కేశవులు, రామాంజులు పాల్గొన్నారు.

# నగరపాలక కార్యాలయంలో వినతుల స్వీకరణ



**చిత్తూరు- ఆంధ్రనాడు, మే 11:** నగరపాలక కార్యాలయంలో సోమవారం "ప్రజా సమ స్యల పరిష్కార వేదిక" (పీజీ ఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించారు. కమిషనర్ పి నర సింహ ప్రసాద్ ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజల నుంచి వ చ్చిన ఫిర్యాదులపై అక్కడికక్కడే సంబంధిత అధికారులతో చర్చించారు. ఫిర్యాదులపై క్షేత్రస్థాయి విచారణ చేసి సత్వరం పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులను ఆ దేశించారు. సోమవారం నాటి కార్యక్రమంలో ఇంజనీరింగ్ -4, టౌన్ ప్లానింగ్ -1 చొప్పున మొత్తం 5 వినతులు అందాయి. కార్యక్రమంలో ఏసీపీ నాగేంద్ర, ఇతర అధి కారులు పాల్గొన్నారు.



# మదనపల్లి 9వ వార్డులో అట్టహాసంగా టీడీపీ జెండా ఆవిష్కరణ

**- ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే షాజహాన్ బాషా**
**- అపూర్వ స్వాగతం పలికిన రాటకొండ భారతి**



**మదనపల్లి – ఆంధ్రనాడు, మే 11:** పట్టణంలో 9వ వార్డ్ పరిధిలోని సుభాష్ రోడ్డు నందు రాటకొండ భారతి, రాటకొండ శేఖర్ బాబుల ఆధ్వర్యంలో సోమవారం తెలుగుదేశం పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మహమ్మద్ షాజహాన్ హాజరయ్యారు. ముందుగా ఎమ్మెల్యేకి రాటకొండ భారతి శాలువా, పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం పార్టీ శ్రేణులతో కలిసి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజమే దేవాలయం – ప్రజలే దేవుళ్లు అనే సిద్ధాంతంతో నాడు స్వర్గీయ నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించి సంక్షేమ పాలనకు శ్రీకారం చుట్టారన్నారు. ఆయన స్ఫూర్తితో ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలుగుదేశం పార్టీకి జాతీయస్థాయిలో గుర్తింపు తీసుకొస్తున్నారని కొనియాడారు. ఏపీ అభివృద్ధిలో తెలుగుదేశం పార్టీది ప్రత్యేక ముద్ర అన్నారు. 9వ వార్డులో తెలుగుదేశం పార్టీ బలోపేతానికి రాటకొండ భారతి, రాటకొండ శేఖర్ బాబు విశేష కృషి చేస్తున్నారని ప్రశంసించారు. త్వరలో జరుగబోవు మున్సిపల్ ఎన్నికల్లో కలిసికట్టుగా ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం రాటకొండ భారతి మాట్లాడుతూ ప్రజల అభిమాన నాయకుడు ఎమ్మెల్యే షాజహాన్ బాషా సారధ్యంలో మదనపల్లి నియోజకవర్గం శరవేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ఆయన నేతృత్వంలో పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తున్నట్లు ఆమె స్పష్టం చేశారు. జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి విచ్చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి శ్రేణులు పాల్గొన్నారు.



# జిల్లాలో ప్రతి చెరువుకు సంబంధించిన సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలి

**- ఎక్కువ ఆయకట్టు ఉన్న చెరువులు మొదట ప్రాధాన్య ఇచ్చి జలధార కార్యక్రమాలు చేపట్టాలి**
**- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్**



**చిత్తూరు- ఆంధ్రనాడు, మే 11:** జిల్లాలో జలధార – నీటి భద్రత కింద చేపడుతున్న పనుల వలన భూ గర్భ నీటి మట్టం పెంచేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు, సోమవారం స్థానిక కలెక్టరేట్లోని నాగార్జున ఐఏఎస్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి పలమనేరు నియోజకవర్గానికి సంబంధించి జలధార కార్యక్రమ పనులపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 3106 చెరువులు ఉన్నాయని ప్రతి చెరువు సంబంధించిన సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించారు, ప్రతి మండలంలో ఉన్న అన్ని మైనర్ ఇరిగేషన్ ట్యాంకులను పరిశీలించి, వాటికి సంబంధించిన ఫీడర్ కాలువలను పూర్తిగా పునరుద్ధరించారా లేదా అనే విషయం పై ప్రత్యేకంగా దృష్టి సారించాలి. గత ఆరు నెలల్లో భూగర్భ జలాలు సుమారు ఆరు మీటర్ల వరకు తగ్గిన నేపథ్యంలో రాబోయే నెలల్లో వర్షపాతం తక్కువగా ఉండే అవకాశం ఉన్నందున భూగర్భ జలాల స్థాయిని పెంచేందుకు జలధార జలహారతి కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఫీడర్ కాలువల పునరుద్ధరణ పనులను మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద శ్రామికుల ద్వారా చేపట్టాలని, శ్రామికులు పని చేయలేని ప్రాంతాల్లో ప్రత్యేక టీఆర్-27 నిధులతో యంత్రాల సహాయంతో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఇంకా చాలా మండలాల్లో పనులు సంతృప్తికరంగా సాగుతున్నాయని, ఇంకా కొన్ని మండలాల్లో భూ సమస్యలను గుర్తించారు. పెద్దపంజాణి, పలమనేర్, వీకోట, బైరెడ్డిపల్లి, గంగవరం మండలాలలో చెరువులపై ఆరా తీశారు, ప్రతి చెరువు ఎంత విస్తీర్ణం కలిగి ఉన్నది, ఎన్ని ఎకరాలు ఆయుకట్టు ఉన్నది, సమగ్ర సమాచారం కలిగి ఉండాలని ఆదేశించారు వచ్చే సమావేశంలో సమగ్ర నివేదికలతో సంబంధించిన ప్రతి ఒక్క అధికారి హాజరు కావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డ్వామా పిడి రవికుమార్, ఎస్ ఈ ఇరిగేషన్ వెంకటేశ్వర రాజు, డిడి గ్రౌండ్ వాటర్ గోవర్ధన్, ఎంపీడీవోలు, డ్వామా ఏపీడి లు, డ్వామా ఏపీవోలు, ఇరిగేషన్ ఏఈలు, పలమనేరు నియోజకవర్గం సంబంధించిన ఆయా మండలాల సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.



### ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అందిన అర్జీలను


# వేగంగా, నిర్ణీత గడువులోపు పరిష్కరించాలి

**- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్**
**- కలెక్టరేట్లో నిర్వహించిన పీజిఆర్ఎస్ కార్యక్రమానికి వచ్చిన వినతలు 202**





**చిత్తూరు- ఆంధ్రనాడు, మే 11:** పీజీఆర్ఎస్ కార్యక్రమంలో అందిన అర్జీలను వేగంగా, లబ్ధిదారుల సంతృప్తి స్థాయిని పెంచేలా..నిర్ణీత గడువులోపు పరిష్కారించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. చిత్తూరు జిల్లాలోని కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ అమలులో భాగంగా కలెక్టరేట్లో సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించున్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, కలెక్టర్ తో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ రాజేంద్రన్, కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజల నుంచి అర్జీ స్వీకరించే కార్యక్రమంలో, మోహన్ కుమార్, చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులు, డిప్యూటీ కలెక్టర్ సురేష్, డిపిఎం కృష్ణ నాయక్, వాసుదేవన్, చిత్తూరు, అర్బన్ ఎమ్మార్వో కులశేఖర్, రూరల్ ఎమ్మార్వో కళ్యాణి, తదితర అధికారులతో కలిసి హాజరై, జిల్లా చుట్టుపక్కల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు,202 అర్జీలు స్వీకరించారు. ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ వాటిపై సత్వరం, సమగ్రమైన విచారాణ చేపట్టి తగిన పరిష్కారం అందించాలని ఆయా శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందన్నారు. పీజీఆర్ఎస్ కార్యక్రమంలో అందిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యమైన పరిష్కారాలను వేగంగా అందించాలన్నారు. లబ్ధిదారుల సంతృప్తి స్థాయిని పెంచే లక్ష్యంతో ప్రతి అర్జీని తప్పనిసరిగా గడువులోపు పరిష్కారించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. అర్జీలు పరిష్కార పురోగతిని ఎప్పటికప్పుడు ఆన్ లైన్ లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈరోజు నిర్వహించిన కేజిఆర్ఎస్ కార్యక్రమం నందు ప్రజల నుంచి వివిధ సమస్యలపై 202 వినతలు స్వీకరించారు. రెవెన్యూ, సర్వే శాఖ 165, పంచాయతీ రాజ్ 2, పోలీస్ 6, డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ 1, డి ఆర్ డి ఏ 14, సివిల్ సప్ల యిస్ 2, ఏపీఎస్పీడిసిఎల్ 2, ట్రాన్స్పోర్ట్ 1, వాటర్ రిసోర్స్ 2, ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ 1, డిఎమ్ అండ్హెచ్ఓ 1, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ 5, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులు సమస్యలను జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్, మరియు డిఆర్ఓ, ఆర్డిఓ డి ప్యూటీ కలెక్టర్లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబంధించిన జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





## 18న పెద్ది ట్రైలర్ విడుదల

రామ్ చరణ్ నటిస్తున్న'పెద్ది' ట్రైలర్ రిలీజ్ అప్‌డేట్ వచ్చేసింది. బుచ్చిబాబు దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ క్రమంలో ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ ప్రచార కార్యక్రమాలు మొదలయ్యాయి. ఇందులో భాగంగా మే 18న 'పెద్ది' ట్రైలర్‌ను విడుదల చేయనున్నట్లు చిత్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ప్రకటించింది. జాన్వీ కపూర్ ఈ సినిమాలో కథానాయికగా నటిస్తున్నారు. ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. ప్రస్తుతం బుచ్చిబాబు ఇటు ట్రైలర్‌ను సిద్ధం చేయడంతో పాటు, అటు మూవీ ఫైనల్ కట్‌ను కూడా రెడీ చేస్తున్నారట. సెన్సార్ ఇబ్బందులు తలెత్తకుండా ముందుగానే తగిన విధంగా చిత్ర బృందం ముందుకు సాగుతోంది. ప్రచార కార్యక్రమాలను కూడా భారీగా చేయాలని యోచిస్తున్నారు. రూ.300 కోట్ల భారీ బడ్జెట్‌తో రూపొందిన ఈ చిత్రంలో కన్నడ నటుడు శివరాజ్‌కుమార్, దివ్యేందు, జగపతిబాబు, బొమన్ ఇరానీ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. శ్రుతిహాసన్ స్పెషల్ సాంగ్‌లో కనిపించనున్నట్లు సమాచారం.

# మే 21న 'దృశ్యం 3'




మోహన్ లాల్ నటించిన దృశ్యం 3 చిత్రం ఈ నెల 21న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతోంది. ఈసారి 'దృశ్యం 3' తెలుగులో రీమేక్ కావడం లేదు. వెంకటేష్ ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకోవడంతో, మోహన్‌లాల్ నటించిన ఒరిజినల్ మలయాళ వెర్షన్‌నే తెలుగులోకి డబ్ చేసి విడుదల చేయాలని మేకర్స్ నిర్ణయించారు. కేవలం తెలుగులోనే కాకుండా తమిళం, కన్నడ భాషల్లో కూడా డబ్బింగ్ వెర్షన్లు సిద్ధమ వుతున్నాయి. ఇప్పటికే కేరళతో పాటు ఓవర్సీస్ మార్కెట్లలో అడ్వాన్స్ బుకింగ్స్ ప్రారం భమయ్యాయి. తెలుగు, ఇతర భాషల ట్రైలర్లు, విడుదల తేదీల గురించి ఇంకా అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. మలయాళ వెర్షన్ విడుదలయ్యే రోజునే తెలుగు డబ్బింగ్ వెర్షన్ కూడా థియేటర్లలోకి వచ్చే అవకాశం ఉందని సమాచారం. మొదటి రెండు భాగాలు తెలుగు ప్రేక్షకులకు బాగా కనెక్ట్ కావడంతో, ఈ వెర్షన్‌కు కూడా టాలీవుడ్ లో మంచి ఆదరణ లభిస్తుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# మాతృత్వం చాలా నేర్పింది!



"తల్లి అయిన తర్వాత నా జీవితం పూర్తిగా మారిపోయింది" అన్నారు కియారా అద్వానీ. తాజాగా ఆమె ప్రముఖ పాడ్‌కాస్ట్ హోస్ట్ రాజ్ షమానికు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రసవం తర్వాత తల్లి శరీరం, మానసిక స్థితిలో వచ్చే మార్పుల గురించి మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు. 'పాప పుట్టిన తర్వాత మొదటి ఆరు నెలలు నరకం చూశా. నాపై నాకే జాలి చూపించుకోవడం కష్టంగా అనిపించింది. చిన్న చిన్న విషయాలకే ఏడ్చేదాన్ని. భావోద్వేగాలను కంట్రోల్ చేసుకోలేకపోయేదాన్ని. ఈ స్థితినిఅర్థం చేసుకోవడానికి ఆరు నెలల సమయం పట్టింది. ఇంతకాలం కుటుంబం, పని, ఇతరుల గురించి మాత్రమే ఆలోచించిన నేను.. నా కోసం కూడా సమయం కేటాయించుకోవాల్సిన అవసరం ఉందన్న విషయం మాతృత్వం నేర్పింది. ఈ కష్ట సమయంలో నా భర్త సిద్ధార్థ్ మల్హోత్రా చాలా సపోర్ట్ చేశాడు. సినిమాలతో ఎంత బిజీగా ఉన్నా, ప్రతి రోజు రాత్రి డ్రైవ్‌కు తీసుకెళ్లేవాడు. ఆ చిన్న డ్రైవ్స్ కూడా నాకు ఎంతో మానసిక ప్రశాంతతను కలిగించేవి' అంటూ కియారా వివరించారు. కియారా, సిద్ధార్థ్‌లది ప్రేమ వివాహం. 2023లో వీరి పెళ్లి జరిగింది. 2025 జులైలో వీరికి కుమార్తె జన్మించింది.

# శ్రేయస్, ప్రియాన్ష్ మెరుపులు.. పంజాబ్ కింగ్స్ భారీ స్కోరు

**ఢిల్లీ క్యాపిటల్స్‌కు 211 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించిన పంజాబ్**
**అర్ధశతకాలతో చెలరేగిన కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, ప్రియాన్ష్ ఆర్య**
**చివర్లో 8 బంతుల్లో 21 పరుగులు చేసిన సూర్యాంశ్ షెడ్గే**
**ఢిల్లీ బౌలర్లలో స్టార్క్, మాధవ్ తివారీలకు రెండేసి వికెట్లు**
**టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న ఢిల్లీకి నిరాశ**

**ఢిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ బ్యాటర్లు పరుగుల వరద పారించారు. ధర్మశాల వేదికగా మొదట బ్యాటింగ్ చేసిన పంజాబ్, నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 210 పరుగుల భారీ స్కోరు సాధించింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (59), యువ ఓపెనర్ ప్రియాన్ష్ ఆర్య (56) అర్ధశతకాలతో చెలరేగారు.**

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ కింగ్స్‌కు ఓపెనర్లు ప్రియాన్ష్ ఆర్య, ప్రభ్‌సిమ్రాన్ సింగ్ అదిరిపోయే ఆరంభాన్ని ఇచ్చారు. ముఖ్యంగా ఆర్య కేవలం 33 బంతుల్లో 2 ఫోర్లు, 6 సిక్సర్లతో 56 పరుగులు చేసి ఢిల్లీ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. పవర్‌ప్లేలో పంజాబ్ 72 పరుగులు రాబట్టింది. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. కూపర్ కనోలీ (38)తో కలిసి స్కోరు బోర్డును నడిపించాడు.

ఆఖరి ఓవర్లలో శ్రేయస్ తన విశ్వరూపం చూపించాడు. కేవలం 36 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సర్లతో 59 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. అతనికి సూర్యాంశ్ షెడ్గే (8 బంతుల్లో 21) తోడవడంతో పంజాబ్ స్కోరు 200 దాటింది. ఢిల్లీ బౌలర్లలో మాధవ్ తివారీ, మిచెల్ స్టార్క్ చెరో రెండు వికెట్లు తీసినప్పటికీ, భారీగా పరుగులు సమర్పించుకున్నారు. ముఖేశ్ కుమార్ ఒక వికెట్ పడగొట్టాడు.





## భువీని టీమిండియాకు ఎంపిక చేయాలి : రవిచంద్రన్ అశ్విన్



చెన్నై: ఐపిఎల్ లో రాణిస్తున్న ఆర్సీబీ స్టార్ పేసర్ భువనేశ్వర్ కుమార్ ను జాతీయ జట్టుకు ఎంపిక చేయాలని మాజీ దిగ్గజ ఆటగాడు రవిచంద్రన్ అశ్విన్ డిమాండ్ చేశాడు. 2026 ఐపిఎల్ సీజన్‌లో భువీ అద్భుత ప్రదర్శనలు చేస్తున్నాడని, ఇప్పటి వరకు 11 మ్యాచ్‌లు ఆడి 21 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడని ఈ సందర్భంగా గుర్తు చేశాడు. పవర్ ప్లేలో, డెత్ ఓవర్లలో కీలకమైన వికెట్లు పడగొట్టి జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషిస్తుడని తెలిపాడు. ఆదివారం ముంబై ఇండియన్స్‌పై ఆర్సీబీ 2 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో భువీ నాలుగు వికెట్లతో చెలరేగాడు. ఛేజింగ్‌లో దాదాపు ఓటమి ఖాయమనుకున్న ధశలో భారీ సిక్సర్ బాది జట్టు విజయ సమీకరణాన్ని తేలిక చేశాడు. అటు బంతితోనే కాకుండా బ్యాట్‌తోనూ అదరగొడు తున్నాడని ఫామ్ లో ఉన్న భువి ఎంపికపై సెలెక్టర్లు దృష్టి సారించాలన్నాడు.

## ఫ్రాంచైజీపై బిసిసిఐ సీరియస్

**ఈసారి ఉల్లంఘనలు అతిక్రమిస్తే కఠిన చర్యలే..**

ముంబయి: ఐపిఎల్ ఫ్రాంఛైజీలకు బిసిసిఐ మరోసారి మార్గదర్శకాలను జారీ చేసింది. ఫ్రాంచైజీలు పదేపదే మార్గదర్శకాలను ఉల్లఘించడాన్ని బిసిసిఐ తీవ్రంగా పరిగణించింది. రూల్స్ ప్రకారం జట్ల యజమానులు మ్యాచ్‌ల సమయంలో డగౌట్‌కు దూరంగా ఉండాలని, ఆటగాళ్లు లేదా జట్టు సిబ్బందితో మాటల ద్వారా గానీ, చేతల ద్వారా గానీ ఎలాంటి సంప్రదింపులు జరపకూడదు. అయితే, కొందరు యజమానులు పలు సందర్భాల్లో ఈ నిబంధనలను ఉల్లంఘించినట్లు ఆరోపణలు రావడంపై బిసిసిఐ అసహనం వ్యక్తం చేసింది. ఇకపై ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. ఈ సీజన్‌లో కొన్ని అవాంఛనీయ ఘటనలు, ప్రోటోకాల్ ఉల్లంఘనలు బోర్డు అవినీతి నిరోధక విభాగం (ఏసీయూ) దృష్టికి వచ్చాయి. దీంతో అప్రమత్తమైన బీసీసీఐ కొన్ని నిబంధనలను రూపొందించి వెంటనే అమల్లోకి తెచ్చింది. ఆటగాళ్లు, సహాయక సిబ్బంది, జట్టు అధికారుల హోటల్ గదుల్లోకి అనధికార వ్యక్తులను నిషేధించింది. ఇక మీదట ఏ అతిథి అయినా ఆటగాళ్ల గదుల్లోకి వెళ్లాలంటే జట్టు మేనేజర్ నుంచి కచ్చితమైన లిఖితపూర్వక అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొంది. ఈ మేరకు 10 ఫ్రాంఛైజీల సిఇవోలకు బిసిసిఐ కార్యదర్శి దేవజిత్ సైకియా లేఖలు రాశారు.

## సింగపూర్ - ఏపీ నడుమ పోర్టు వాణిజ్య కారిడార్

# పైలట్ ప్రాజెక్టు ప్రారంభించండి

- మిర్చి ఎగుమతులకు సీఐసీ ప్లాట్ ఫాం ద్వారా సహకరించండి
- ఏపీ--సింగపూర్ జాయింట్ కమాడిటీ ట్రేడ్ రౌండ్‌టేబుల్ ఏర్పాటు చేయండి
- ప్రస్తుతం మేం ఓడరేవుల ఆధారిత పారిశ్రామికీకరణపై దృష్టి సారిస్తున్నాం
- కమాడిటీస్ ఇంటిలిజెన్స్ సెంటర్ సీఈవో గ్లోరియా ఊ తో మంత్రి లోకేష్ భేటీ



**సింగపూర్ – ఆంధ్రనాడు, మే 11**

సింగపూర్ కమాడిటీస్ ఇంటిలిజెన్స్ సెంటర్ సీఈవో గ్లోరియా ఊ తో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... సీఫుడ్, వ్యవసాయం, ఖనిజాలు, ఫార్మాస్యూటికల్ రంగాల్లో వాణిజ్య అనుసంధానం, ఎంఎస్ఎంఈ ఎగుమతిదారుల చేరిక, కమాడిటీ ఇంటిలిజెన్స్ సమాచార మార్పిడి వంటి అంశాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం – సీఐసీ మధ్య సహకారాన్ని కోరుతున్నామని తెలిపారు. సీఐసీ బ్లాక్‌చెయిన్ ప్లాట్‌ఫామ్‌ను ఉపయోగించి కాగితరహిత వాణిజ్య ప్రక్రియ, సరుకుల పారదర్శకత కోసం సింగపూర్, విశాఖపట్నం లేదా కృష్ణపట్నం పోర్టు మధ్య ఒక డిజిటల్ వాణిజ్య కారిడార్‌ను పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. మిర్చితోపాటు ఏపీ నుంచి ఎగుమతికి అనువైన సరుకును గుర్తించేందుకు ఆంధ్రప్రదేశ్ లోని ఎగుమతిదారులు, సీఐసీ, ఎంటర్‌ప్రైజ్ సింగపూర్, ఎస్‌జీఎక్స్‌లను ఒకచోట చేర్చి, ఏపీ--సింగపూర్ జాయింట్ కమాడిటీ ట్రేడ్ రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించాల్సిందిగా సూచించారు.

ఆంధ్రప్రదేశ్ భారతదేశంలోనే అతిపెద్ద ఆక్వాకల్చర్ ఉత్పత్తి చేసే రాష్ట్రం. భారతదేశ మిర్చి ఎగుమతుల్లో ఏపీ 40--45% వాటాను కలిగి ఉంది. సముద్ర ఉత్పత్తులు, ఖనిజాలు, ఔషధ రంగాలలో కూడా బలమైన ఉనికిని కలిగి ఉంది. ప్రస్తుతం మేం ఓడరేవుల ఆధారిత పారిశ్రామికీకరణపై దృష్టి సారిస్తున్నాం. దీనిద్వారా మా ఉత్పత్తులను ప్రపంచానికి ఎగుమతి చేయాలనుకుంటున్నాం. ఆసియా, ప్రపంచ కమోడిటీ మార్కెట్ల అనుసంధానంతో డిజిటల్ ఇంటిగ్రేటెడ్ వాణిజ్య, లాజిస్టిక్స్ కేంద్రంగా మారడంలో సీఐసీ (జ×జ) ప్లాట్‌ఫామ్ సామర్థ్యాలు ఆంధ్రప్రదేశ్‌కు ఉపకరిస్తాయి.

కోవిడ్‌కు ముందు సీఐసీ ద్వారా ఏపీ–చైనా మిర్చి వాణిజ్యానికి ప్రయత్నించాం, కానీ కోవిడ్ వల్ల సంస్థాగత మద్దతు లేకపోవడంతో అవాంతరాలు ఎదురయ్యాయి. ఈ వాణిజ్య కారిడార్‌ను పునరుద్ధరించేందుకు సీఐసీ ప్లాట్ ఫాం ద్వారా సహకారం అందించండి. దీనివల్ల మా గుంటూరు మిర్చికి కొత్త మార్కెట్ లభిస్తుంది. ఇందుకోసం ఆంధ్రప్రదేశ్ రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఖీూ) సరుకు సమీకరణ, గ్రేడింగ్, నాణ్యతను ప్రామాణీకరించి, సరఫరా చేస్తాయి. కొనుగోలుదారులను అనుసంధానించడం, వాణిజ్య ఎగుమతుల ఫైనాన్సింగ్‌ను అందించేలా సీఐసీ సహకరించాల్సి ఉంటుంది. ఈ మేరకు తొలుత మిర్చి పైలట్ ప్రాజెక్టును ప్రారంభించండి. ఈ పైలట్ ప్రాజెక్ట్‌ను అమలు చేయడానికి సీఐసీ తన చైనా కొనుగోలుదారుల నెట్‌వర్క్, వాణిజ్య ఫైనాన్స్ యంత్రాంగాన్ని క్రియాశీలం చేయాలని మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు.

ఈ సందర్భంగా సీఐసీ సీఈవో గ్లోరియా ఊ మాట్లాడుతూ... ప్రపంచవ్యాప్తంగా ధృవీకరించబడిన కొనుగోలుదారులు, అమ్మకందారులు, లాజిస్టిక్స్ ప్రొవైడర్లు, ఫైనాన్షియర్‌లను అనుసంధానించే డిజిటల్ బీ2బీ మార్కెట్ ప్లేస్ కమాడిటీస్ ఇంటిలిజెన్స్ సెంటర్ (జ×జ) అని అన్నారు. కమోడిటీ ఇంటెలిజెన్స్, ట్రేడ్ డేటా సెర్చ్ ఇంజిన్, దిగుమతి–డిమాండ్ అంచనా, ధర సిగ్నల్ పర్యవేక్షణ, బ్లాక్‌చెయిన్ ఆధారిత డాక్యుమెంట్ భద్రత, ఒకే క్లిక్‌తో కస్టమ్స్ క్లియరెన్స్, ఎండ్–టు–ఎండ్ ట్రేసబిలిటీ వంటి కార్యకలాపాలను సీఐసీ నిర్వహిస్తుందని తెలిపారు.

సప్లై చైన్ ఫైనాన్స్, క్రెడిట్ అసెస్‌మెంట్, ఎంఎస్ఎంఈ ఎగుమతిదారుల వర్కింగ్ క్యాపిటల్ పరిమితులను సీఐసీ పరిష్కరిస్తుందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ గ్రీన్ హైడ్రోజన్, పునరుత్పాదక ఇంధన ఆశయాలకు అనుగుణంగా ఉండే సుస్థిరత–అనుసంధానిత వాణిజ్య సాధనాలకు సీఐసీ సహకారం అందిస్తుందని చెప్పారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని అన్నారు.

## 2027 జూన్ నాటికి

# పోలవరం పూర్తి

### - మంత్రి నిమ్మల రామానాయుడు



**న్యూఢిల్లీ – ఆంధ్రనాడు, మే 11**

పోలవరం ప్రాజెక్ట్ 2027 జూన్ నాటికి పూర్తవుతుందని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్ ఈ ప్రాజెక్ట్‌ను జాతికి అంకితం చేయనున్నారని వెల్లడించారు. సోమవారం నాడిక్కడ జరిగిన సమావేశం అనంతరం మంత్రి రామానాయుడు మీడియాతో మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పిపిఎ), సెంట్రల్ వాటర్ కమిషన్ (సిబ్ల్యూసి) నిర్దేశించిన గడువు ప్రకారం 2027 నాటికి ప్రాజెక్ట్‌ను పూర్తి చేస్తామని కేంద్ర మంత్రి స్పష్టం చేసినట్లు చెప్పారు. కరవు రహిత రాష్ట్రంగా మార్చడంలో పోలవరం కీలకమని మంత్రి తెలిపారు. వైసిపి పాలనలో పోలవరం ప్రాజెక్ట్‌ను ప్రశ్నార్థకం చేశారని విమర్శించారు. పోలవరం సివిల్ వర్క్స్, ఆర్ అండ్ ఆర్ అంశాలను కేంద్ర మంత్రికి వివరించామన్నారు. తొలి దశలో 41.15 మీటర్ల ఎత్తుకు నీటిని నిల్వ చేసేందుకు అవసరమైన నిర్మాణాలు పూర్తి చేయడంలో కేంద్రం సహకరించాలని కోరారు. తుంగభద్ర ప్రాజెక్టు గేట్లు ప్రమాదకర స్థితిలో ఉన్నాయని, వైసిపి పాలనలో వాటిని పట్టించుకోలేదని ఆరోపించారు. గత ఏడాది 19వ గేటు కొట్టుకుపోయిందని, కొత్త గేట్ల ప్రారంభోత్సవంపై కేంద్ర మంత్రితో చర్చించామని వెల్లడించారు. గోదావరి కావేరి అనుసంధానం చేసుకుంటే అన్ని సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని తెలిపారు. గోదావరి కావేరి ఏ విధంగా ఇంటర్ లింకింగ్ చేయాలన్న దానిపైన యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామని చెప్పారు. గోదావరిలో ప్రతి సంవత్సరం సుమారు 3,000 టిఎంసిల వరద నీరు .వృథాగా సముద్రంలో కలుస్తోందన్నారు. ఈ మిగులు జలాలను సమర్థవంతంగా వినియోగించుకోవడంతో తెలుగు రాష్ట్రాలకు లాభం చేకూరుతుందని అన్నారు. భూగర్భ జలాలను పెంపొందించేందుకు కార్యాచరణ చేపట్టామని రామానాయుడు తెలిపారు. ఇప్పటికే ముఖ్యమంత్రి కలెక్టర్లతో గ్రౌండ్ వాటర్ సమస్యలపై సమీక్ష నిర్వహించారన్నారు. దేశంలో ప్రయోగాత్మకంగా ఎంసిఎడి మోడల్ సిస్టమ్‌ను విజయనగరంలో ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు.




Printed, Published Edited and Owned by M.HARIBABU, Printed at AKSHARA PRINTERS, 1st Floor, SSS Complex, Air Bypass Road, Tirupati Town, Tirupati District, A.P.,
Published at AKSHARA PUBLICATIONS, Tirupati, Editor : M.Hari Babu , Cell : 9490400684, RNI: 2009/28733